# ప్రజా తపన

prajathapana.com

News that matters




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక:70 శుక్రవారం 28 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




# జీఎస్టీతో నల్లధనానికి చెక్ పెట్టాం

**డీబీటీతో అవినీతి అంతమైంది**

**దీంతో అవినీతిపరులు తనపై కోపంగా ఉన్నారు**

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**

ఓ జాతీయ ఛానెల్ సమ్మిట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీతో నల్లధనానికి చెక్ పెట్టామన్నారు. డీబీటీతో అవినీతి అంతమైందని, దీంతో అవినీతిపరులు తనపై కోపంగా ఉన్నారని మోదీ చెప్పారు. సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు చేకూరుతోందన్నారు. హౌజింగ్ స్కీమ్, ముద్ర రుణాల గురించి ప్రధాని ప్రస్తావించారు. మూడు కోట్ల 75 లక్షల మందికిపైగా ఇళ్లు కట్టించి ఇచ్చామన్నారు. ఇంటి యాజమాన్య హక్కులు మహిళలకు ఇచ్చామని, కోట్లాది మంది సోదరీమణులు లక్షాధికారులయ్యారని ప్రధాని చెప్పారు. తమకు అందుతున్న వాటాతో పేద ప్రజలు సామాజిక న్యాయం జరుగుతోందని భావిస్తున్నారని మోదీ చెప్పారు. ముద్రా పథకం ద్వారా కోట్లాది మంది చిరువ్యాపారులకు రుణాలు అందించామన్నారు.తమ తొమ్మిదేళ్ల పాలనలో 9వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి భారత్ ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని ప్రధాని చెప్పారు. 9 సంవత్సరాలుగా దళితులు, పేదల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకొచ్చామని మోదీ చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా పేద ప్రజల కోసం 80 వేల కోట్లు ఖర్చుపెట్టామన్నారు. కోవిడ్ సమయం నుంచి నాలుగున్నర లక్షల కోట్ల రూపాయలతో పేద ప్రజలకు అన్న యోజన ద్వారా ఉచితంగా బియ్యం అందిస్తున్నామని ప్రధాని చెప్పారు. మన్‌రేగా డబ్బులు కార్మికులకు 15 రోజుల్లోనే అందుతున్నాయని చెప్పారు. లక్షల కోట్లు దుర్వినియోగం కాకుండా కాపాడామన్నారు.కోవిడ్ సమయంలో అత్యంత నాణ్యమైన స్వదేశీ వ్యాక్సిన్లు తయారు చేశామని మోదీ చెప్పారు.

02

# బోర్న్‌విటాకు నోటీసులు

**ముంబాయి**

తమ పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని.. శారీరకంగా దృఢంగా ఉండాలని ప్రతి తల్లిదండ్రులు భావిస్తారు. అందుకోసం తమ పిల్లలకు మార్కెట్ లో దొరికే రకరకాల హెల్త్ డ్రింక్స్‌ను ఇస్తారు. అయితే పిల్లలకు మీరు ఆరోగ్యం కోసం ఇస్తున్న ఈ హెల్త్ డ్రింక్ లో ఏముందో అని ఎప్పుడైనా ఆలోచించారా..? ఇటీవల ఒక యూట్యూబర్ ఫేమస్ హెల్త్ డ్రింక్ బోర్న్‌విటాను తయారు చేస్తున్న పదార్థాలు, వాటి నాణ్యతను ప్రశ్నించారు.తాజాగా జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ బోర్న్‌విటార్ తయారీదారు మోండెలెజ్ ఇండియా ఇంటర్నేషనల్‌కు నోటీసు పంపింది. బోర్నవిటా ప్యాకేజ్, లేబులింగ్, ప్రకటనలు కస్టమర్స్ ను తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని ఆరోపిస్తూ ఈ ప్రకటనలను పునఃపరిశీలించాలని, తప్పుదారి పట్టించే ప్రకటనను ఉపసంహరించుకోవాలని ఆదేశిస్తూ కంపెనీకి నోటీసు జారీ చేసింది. బోర్న్‌విటాలో చక్కెర అధికంగా ఉండటంపై ఇటీవల వివాదం చెలరేగడంతో నేషనల్ కమిషన్ ఫర్




ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ నోటీసు పంపింది.బోర్నవిటాలో అధిక శాతం చక్కెర, క్యాన్సర్‌కు కారణమయ్యే రంగులు, పిల్లల ఆరోగ్యానికి హాని కలిగించే ఇతర పదార్థాలు ఉన్నాయన్నది ఆ కంపెనీపై వచ్చిన ఆరోపణలు కమిషన్ దృష్టికి వచ్చిందని, పిల్లల ఆరోగ్యానికి హాని కలిగించే అనేక పదార్థాలు లేదా ఫార్ములాలను కలిగి ఉంది," అని మోండెలెజ్ కంపెనీ ప్రెసిడెంట్ దీపక్ అయ్యర్‌కు పంపిన నోటీసులో తెలిపారు. తయారీదారులకు నోటీసులు పంపడంతో పాటు, చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ బోర్న్‌విటా తయారీదారులపై

02



## వివేక హత్య కేసులో ఆ ముగ్గుర్ని కాపాడటానికే ప్రయత్నాలు

**- సీబీఐ దర్యాప్తు అధికారిపై అవినాష్ రెడ్డి ఆరోపణలు**

**పులివెందుల**

.వివేక హత్య కేసులో తనపై వస్తున్న ఆరోపణలకు సుదీర్ఘ వివరణ ఇస్తూ వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి వీడియో రిలీజ్ చేశారు. ఓవైపు గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయడం... సాయంత్రం అవినాష్ రెడ్డి ముందస్తు బెయిల్‌పై విచారణ జరగనున్న వేళ ఈ వీడియో విడుదల

02

# ఈడీపై కవిత పిటిషన్

**ధర్మాసనానికి మెన్షన్ చేసిన కపిల్ సిబల్**

**ప్రజా తపన ,న్యూఢిల్లీ:**

ఈడీపై ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను త్వరగా విచారణ చేపట్టాలని జస్టిస్ రస్తోగి ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ మెన్షన్ చేశారు. మహిళలను ఈడీ కార్యాలయానికి పిలిచి విచారణ చేయొచ్చా అనే అంశాన్ని సవాల్ చేస్తూ గతంలో కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వచ్చే సోమవారం కవిత పిటిషన్ విచారించాలని ధర్మాసనానికి కపిల్ సిబల్ విజ్ఞప్తి చేశారు. అభ్యర్థనను పరిశీలిస్తామని జస్టిస్ రస్తోగి ధర్మాసనం తెలిపింది.ఈడీపై ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో గత నెలలో విచారణ జరిగింది. కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మూడు వారాల



పాటు వాయిదా వేసింది. మహిళలను ఈడీ కార్యాలయానికి పిలిచి విచారణ జరిపే విషయంలో గతంలో దాఖలు చేసిన నళినీ చిదంబరం పిటిషన్‌కు సుప్రీంకోర్టు ట్యాగ్ చేసింది. కవిత తన పిటిషన్‌లో సరికొత్త అభ్యర్థన చేశారు. మద్యం పాలసీ కేసు విచారణ కోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేయాలని కోరారు. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, విక్రమ్ చౌధురి కవిత తరఫున వాదనలు వినిపించారు. ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. ఒక మహిళగా తనకు ఉన్న హక్కులను ఈడీ కాలరాస్తోందంటూ సుప్రీంకోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు. వ్యక్తిగతంగా హాజరుకావాలంటూ తనకు పీఎంఎల్ఏ చట్టంలోని సెక్షన్ 50 ప్రకారం జారీచేసిన నోటీసులు సీఆర్‌పీసీ సెక్షన్

02

# బీసీలకు స్వర్ణయుగం తెస్తాం

**మంత్రాలయం**

మంత్రాలయం లో టీడీపీ నేత నారా లోకేష్ పాదయాత్రలో భాగంగా బీసీ సామాజికవర్గం ప్రతినిధులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు. మంత్రాలయం నియోజకవర్గం బీసీ నేతలు మాట్లాడుతూ బోయ, వాల్మీకి లను ఎస్టీల్లో చేరుస్తామని జగన్ మోసం చేశారు. బోయ, వాల్మీకిలకి ఎటువంటి కుల వృత్తి లేదు. బిసిలకు అమలు అయ్యే ఏ సంక్షేమ కార్యక్రమం మాకు అందడం లేదు. మాదాసి కురువ లకు జగన్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసింది. టిడిపి హయాంలో గొర్రెల పెంపకం కోసం సహాయం అందించేవారు. ఇప్పుడు ఆ సంక్షేమ కార్యక్రమాలు జగన్ ప్రభుత్వం ఆపేసిందని అన్నారు. వడ్డెర కులస్తులను జగన్ ప్రభుత్వం మోసం చేసింది. మాకు కార్పొరేషన్ ద్వారా ఎటువంటి రుణాలు అందడం లేదు. కల్లు గీత కార్మికులను వైసిపి ప్రభుత్వం కోలుకోలేని దెబ్బకొట్టింది. రజకులను జగన్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తుంది. ఎటువంటి సహాయం అందడం లేదు. మత్స్యకారులను జగన్ ప్రభుత్వం వేధిస్తుందని అన్నారు.

నారా లోకేష్ మాట్లాడుతూ బీసీ ల భద్రత కోసం టిడిపి అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టం తీసుకొస్తాం. న్యాయ పోరాటానికి అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే శాశ్వత బీసీ కుల ధృవీకరణ పత్రాలు అందజేస్తాం. ఫోన్లో ఒక్క బటన్ నొక్కగానే ప్రభుత్వమే మీ ఇంటికి శాశ్వత



కుల ధృవీకరణ పత్రాలు అందజేసే విధానం తీసుకొస్తాం. దామాషా ప్రకారం బీసీ ఉప కులాలకు నిధులు కేటాయిస్తాం. సబ్సిడీ రుణాలు అందిస్తాం. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదరణ పథకం తిరిగి ప్రారంభిస్తాం. జగన్ కాన్వాయ్ కి అడ్డం పడుకొని నిరసన తెలిపిన రైతుల్ని ఆదర్శంగా తీసుకొని అందరూ ప్రభుత్వం పై

02

# ఈ ఏడాది యధావిధిగా చేప ప్రసాదం

**ప్రజా తపన ,హైదరాబాద్:**

ఆస్తమా బాధితులకు శుభవార్త. జూన్ 10 నుంచి చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. మూడేళ్ల తరువాత బత్తిని సోదరులు చేప ప్రసాదం చేయనున్నారు. ఆస్తమా బాధితులకు ప్రతి ఏడాది హైదరాబాద్ లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ చేయడం తెలిసిందే. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో పంపిణీకి అనుమతి లభించింది. జూన్ 11న ఉదయం 8 గంటల వరకు చేప ప్రసాదం పంపిణీ జరుగుతుందని తెలిపారు.ప్రతి ఏడాది మృగశిర కార్తె వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఆస్తమా బాధితులతో కిటకిటలాడుతుంది. ఆస్తమా సమస్య ఉన్న వారికి బత్తిని వంశస్తులు చేప ప్రసాదం మందును పంపిణీ చేస్తారు. ఏపీతో పాటు పొరుగు రాష్ట్రాలు, దేశంలోని ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఆస్తమా పేషెంట్లు చేప మందు తీసుకునేందుకు ప్రతి ఏడాది హైదరాబాద్‌కు వచ్చేవారు. కానీ కరోనా నిబంధనల కారణంగా 2020 నుంచి 2022 వరకు వరుసగా మూడేళ్లపాటు చేప ప్రసాదం పంపిణీ జరగలేదు. కరోనా వ్యాప్తి తరువాత, అప్పటి పరిస్థితుల్లో గత ఏడాది సైతం చేప ప్రసాదం పంపిణీకి తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. తాజాగా చేప ప్రసాదం పంపిణీకి బత్తిని వంశస్తులకు అనుమతి లభించింది. దీంతో ఆస్తమా పేషెంట్లు చేప ప్రసాదం కోసం జూన్ 10, 11 తేదీల్లో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ కు రావాలని నిర్వాహకుడు బత్తిని గౌరీ శంకర్

02

ప్రజా తపన
prajathapana.com

## జీఎస్టీతో నల్లధనానికి చెక్ పెట్టాం

(మొదటిపేజీ తరువాయి)

ఇతర దేశాల వాళ్లు తయారు చేస్తున్నప్పుడు దేశీయంగా వ్యాక్సిన్లు తయారు చేయడం ఎందుకని కొందరు ప్రశ్నించారని మోదీ గుర్తు చేశారు. ఇతర దేశాలకు కూడా వ్యాక్సిన్లు పంపిణీ చేశామన్నారు. డిజిటల్ ఇండియాను కూడా పక్కదారి పట్టించేందుకు కొందరు యత్నించారని మోదీ చెప్పారు. డిజిటల్ ఇండియా ద్వారా దేశ ఆర్థిక స్వరూపాన్నే మార్చేశామన్నారు. చాయ్ దుకాణం నుంచి కూరగాయల దుకాణాల వరకూ డిజిటల్ పేమెంట్స్ అవుతున్నాయని మోదీ చెప్పారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ పేమెంట్స్ భారత్‌లోనే జరుగుతున్నాయని మోదీ గుర్తు చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల్లో పది కోట్ల మంది నకిలీ పేర్లతో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిధులు పంచారని, తాము నకిలీలను ఏరిపారేశామన్నారు. అవినీతి, కుటుంబ రాజకీయాలపై తమ పోరు కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

## బోర్న్‌విటాకు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

తప్పుదారి పట్టించే ప్రకటనలు, ఆహార భద్రత మార్గదర్శకాలను అనుసరించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా.. సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీని అభ్యర్థించింది. దీంతో, బోర్నవిటా కంపెనీకి ఔఆఖఅఖీ నోటీసు ఇచ్చింది. అయితే.. మోండెలెజ్ ఇంటర్నేషనల్ ఇండియా కంపెనీకి లీగల్ నోటీసు అందిన తర్వాత, ఆ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ తన వీడియోను తొలగించాడు. అప్పటికే ఆ వీడియోను 1.2 కోట్ల మంది చూసినట్లు నమోదైంది. ఇటీవల ఒక యూట్యూబర్ బోర్న్‌విటాలో షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉందని, కోకో ఘన పదార్థాలు, క్యాన్సర్‌కు కారణమయ్యే రంగులు ఉన్నాయని ఆరోపిస్తూ ఒక వీడియోను పోస్ట్ చేయడంతో వివాదం మొదలైంది. ఈ వీడియోపై బోర్న్‌విటా తయారీదారు స్పందిస్తూ.. అతని వాదన తప్పు అని, యూట్యూబర్‌కు లీగల్ నోటీసు పంపారు. ఆ తర్వాత ఆ వీడియోను డిలీట్ చేశాడు. అయితే అప్పటికే ఆ వీడియోను 1.2 కోట్ల మంది చూసినట్లు తెలుస్తోంది

## ఈడీపై కవిత పిటిషన్

(మొదటిపేజీ తరువాయి)

160కి విరుద్ధంగా ఉన్నాయని, వాంగ్మూలం నమోదు చేసేప్పుడు న్యాయవాది సమక్షంలో వీడియో చిత్రీకరణకు ఉత్తర్వులు జారీ చేయాలని కవిత ఆ పిటిషన్‌లో కోరారు. తన ఫోన్‌ను స్వాధీనం చేసుకొని, జారీ చేసిన జప్తు నోటీసులను రద్దు చేయడంతో పాటు.. ఫోన్‌ను సీజ్ చేయడం చెల్లదని ఆదేశాలు ఇవ్వాలని, ఈ పిటిషన్‌ను నళినీ చిదంబరం వర్సెస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసుకు జత చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా ఎం.త్రివేదిల ధర్మాసనం విచారణకు స్వీకరించింది. తొలుత శుక్రవారం విచారణ జరుపుతామని చెప్పినా.. ఆ తర్వాత తదుపరి విచారణ తేదీని 27గా ప్రకటించింది. కాగా.. కవిత ఇప్పటికే ఈడీ ఎదుట మూడుసార్లు హాజరై.. తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. సాక్షిగా పిలిచిన మహిళను తమ ఇంటి వద్ద లేదా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించాలని పిటిషన్‌లో కవిత కోరారు. సీఆర్పీసీ సెక్షన్ 160ని ఉల్లఘించి... తనని ఈడీ కార్యాలయానికి పిలిచి విచారిస్తున్నారని కవిత పేర్కొన్నారు. విచారణ సందర్భంగా... ఈడీ అధికారులు మానసిక, శారీరక ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. గతంలో పలు ఉదాహరణలు ఉన్నాయని కవిత తెలిపారు. ఈడీ అధికారులు వ్యవహరించిన తీరు విస్మయానికి గురి చేసిందని పిటిషన్‌లో కవిత పేర్కొన్నారు. ఈడీ అధికారులు కొంత మంది నిందితుల పట్ల ప్రవర్తించిన తీరు తనని ఆందోళనకు, భయానికి గురి చేస్తోందని తెలిపారు. న్యాయవాదుల సమక్షంలో, సీసీ టీవీ కెమెరాల నిఘాల్లోనే విచారణ చేపట్టేలా తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## ఈ ఏడాది యధావిధిగా చేప ప్రసాదం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. దాదాపు 170 ఏళ్ల నుంచి బత్తిని వంశస్తులు ఆస్తమా పేషెంట్ల కోసం నగరంలో చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. కానీ కరోనా వైరస్ వ్యాప్తితో మూడేళ్ల కిందట 2020లో తొలిసారి చేప ప్రసాదం పంపిణీకి బ్రేక్ పడింది. కరోనా వ్యాప్తి చెందుతున్న కారణంగా, కొవిడ్19 నిబంధనలు పాటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేప ప్రసాదం పంపిణీకి అనుమతి ఇవ్వలేదు. గత ఏడాది సైతం ప్రభుత్వం నో చెప్పడంతో ఆస్తమా పేషెంట్లకు నిరాశే ఎదురైంది. కనీసం ఈ ఏడాదైనా తమకు చేప మందు దొరుకుతుందని ఆస్తమా పేషెంట్లు భావించారు. ఈ ఏడాది మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్‌కు వచ్చి చేప మందు తీసుకుందామనుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందని తెలియడంతో ఆస్తమా బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది చేప ప్రసాదం నిర్వహణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించింది, అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు బత్తిని మృగశిర ట్రస్టు సభ్యులు మంగళవారం తెలిపారు. చేప ప్రసాదం పంపిణీ కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ అధికారులతో పాటు మున్సిపల్, నీటి, రవాణా, విద్యుత్, మత్స్యశాఖ, ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వ పోలీసు శాఖతో సహా సంబంధిత శాఖలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు బత్తిన ట్రస్టు సభ్యులు వివరించారు. అన్ని కుదిరితే మూడేళ్ల తరువాత ఆస్తమా బాధితులకు చేప ప్రసాదం లభిస్తుంది.

## మావోయిస్టు దంపతుల లొంగుబాటు

**వరంగల్**

నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన మావోయిస్టు దంపతులు గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు కాసరనేని రవికుమార్ అలియాస్ అజిత్, ఆలియాస్ మున్నా, ఆలియాస్ సూర్యా, అతడి భార్య మడివి సోమిడి అలియాస్ కల్పనను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన కాసరనేని రవికుమార్ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజనల్ కమిటీ మెంబర్,మణుగూరు ఎల్.ఓ.ఎస్ కమాండర్‌గా ఉన్నాడు. అతడి భార్య మడివి సోమిడి చర్ల మండలానికి చెందినవారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, పాల్వంచ ఏరియా కమిటీ మెంబర్‌గా, మణుగూరు ఎల్వోఎస్ డిప్యూటీ కమాండర్‌గా కొనసాగుతున్నారు. కాగా విప్లవ సిద్ధాంతాలు నచ్చకపోవడంతోపాటు అనారోగ్యం కారణంగా లొంగిపోయినట్లు సీపీ వెల్లడించారు. స్వగ్రామంలో పదో తరగతి వరకు చదువుకున్న రవి కుమార్ ఇంటర్ మొదటి సంవత్సరంలో చదువును మధ్యలోనే ఆపివేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో తమ బంధువుల ఇంటిలో కొద్ది సంవత్సరాలు నివాసం వున్నాడు. ఇదే సమయంలో విప్లవ భావాలు కలిగి గల రవికుమార్ 2012 సంవత్సరంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్లో జాయిన్ అయ్యాడు. అనంతరం కొద్ది రోజులకు కొత్తగూడెం కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఎంపికకై ఆతర్వాత పీడీఎస్‌యూలో చేరాడు. 2016 సంవత్సరంలో మావోయి స్టుల సిద్ధాంతాలకు ఆకర్షితుడై రవికుమార్ తెలంగాణ మావోయిస్టు పార్టీ కార్యదర్శి యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ పోత్సహంతో పార్టీ సభ్యుడిగా చేరారు. చర్ల ఏరియా కమాండర్ సోడి జోగయ్య నాయకత్వంలో పనిచేశాడు. 2017 సంవత్సరంలో డిప్యూటీ కమాండర్ గా పనిచేశాడు.

## వివేక హత్య కేసులో ఆ ముగ్గుర్ని కాపాడటానికే ప్రయత్నాలు

(మొదటిపేజీ తరువాయి)

సంచలనంగా మారుతోంది. ఎవర్నో కాపాడేందుకు సీబీఐ విచారణను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు అవినాష్ రెడ్డి. హత్య జరిగిన రోజు ఏం జరిగిందో ప్రజలందరికీ తెలియాలని సుమారు ఏడు నిమిషాల నిడివితో ఓ వీడియోను విడుదల చేశారు. ఆయన ఏమన్నారంటే..."నాకు శివప్రకాష్ రెడ్డి ఆరుగంటలకు ఫోన్ చేశారు. అప్పటిగే జమ్మలమడుగు వెళ్తున్నాను. జీకే కొండారెడ్డి అనే లీడర్ పార్టీలో జాయన్ అవుతున్నారు. అక్కడే బ్రేక్ ఫాస్ట్ చేయాలని కూడా అనుకున్నాను. పులివెందుల రింగ్ రోడ్ వద్ద ఉన్నాను శివప్రకాష్ రెడ్డి ఫోన్ చేశారు. అర్జెంట్‌గా వివేకం బావ ఇంటికి వెళ్లు అన్నారు. ఎందుకు అంకుల్ అని అడిగితే.. బావ చనిపోయారు అని చెప్పారు. వెంటనే నేను వివేక ఇంటికి వెళ్లాను. సార్ వివేక చనిపోయారు బాత్‌రూమ్‌లో డెడ్‌బాడీ ఉందీ అని అక్కడే ఉన్న కృష్ణారెడ్డి నాకు చూపించారు. బెడ్‌రూం నుంచి బయటకు వచ్చే ముందు మరోసారి అడిగాం. ఏమైనా అనుమానాస్పదంగా ఉన్నాయా అంటే ఏం లేవు అని అడిగారు. అప్పటికే మేం వెళ్లకు ముందు ఏం జరిగిందో ప్రజల ముందు పెడుతున్నాను. మేం వెళ్లక ముందే అక్కడ వివేక రాసిన లెటర్ ఉంది. ఒక మొబైల్ ఫోన్ ఉంది. ఆ రెండు ఉన్న విషయాన్ని అల్లుడు రాజశేఖర్ రెడ్డికి పీఏ కృష్ణారెడ్డ చెప్పారు. రెండో ఆలోచన చేయకుండా ఆ లెటర్ దాచిపెట్టమని చెప్పారు. మొబైల్ ఫోన్ కూడా దాచి పెట్టు అని చెప్పారు.ఆ లెటర్‌లో వివేక ఏం రాశారంటే... నేను డ్యూటీకి త్వరగా రమ్మని చెప్పానని డ్రైవర్ చచ్చేలా కొట్టినాడు. ఈ లెటర్ రాసేందుకు నేను చాలా కష్టపడ్డాను డ్రైవర్ ప్రసాద్‌ను వదిలిపెట్టవద్దు. డ్రైవర్‌ను వదిలి పెట్టవద్దు అని రాశారు. దీన్ని దాచి పెట్టమని కృష్ణారెడ్డికి రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. ఈ లెటర్ ఈ కేసులో కీ ఎవిడెన్స్. ఈ లెటర్ ఎందుకు దాచి పెట్టారని అడిగితే... ప్రసాద్ చాలా మంచోడు అని సునీత, రాజశేఖర్ రెడ్డి చెప్తున్నారు. ప్రసాద్‌ను ఎవరైనా ఏమైనా అంటారేమో అని దాచి పెట్టామని అంటున్నారు. ఇది చాలా హాస్యాస్పదంగా లేదా... మీ నాన్ని చివరి సారిగా రాసిన లేఖ, చెప్పిన మాటలను నమ్మరా? ప్రసాద్‌నే ఎక్కువగా నమ్ముతారా? సీబీఐ స్టేట్‌మెంట్స్‌లో కూడా ఓ సారి ఒకలా మరోసార మరోలా చెప్పారు. మిస్టేక్స్‌ను కవర్ చేస్తూ మరో స్టేట్మెంట్ ఇచ్చారు. అలా స్టేట్మెంట్ స్టేట్‌మెంట్‌కు మిస్టేక్స్ కవర్ చేసుకోవడానికి కూడా సీబీఐ వాళ్లకు స్వేచ్ఛ ఇచ్చింది. ఈ లెటర్ దాచి పెట్టడం అనేది పోలీసులకు ఇన్‌టైంలో చెప్పకపోవడం ఈ కేసులో బిగ్గెస్ట్ బ్లండర్. అలాంటి విషయాన్ని సీబీఐ ఐవో రాంసింగ్ తగ్గించి వేరేలా కేసును విచారిస్తున్నారు. సీబీఐ మొత్తాన్ని తప్పుపట్టే పెద్దవాడిని కాదు కానీ... ఈ ఐవో రాంసింగ్ వైఖరి మాత్రం తేడాగా ఉంది. ఎవర్ని కాపాడటానికి ఈ ప్రయత్నం చేస్తున్నారు. సునీతను, రాజశేఖర్‌రెడ్డిని, శివప్రకాష్ రెడ్డిన కాపాడటానికే ఇలా చేస్తున్నారా? తప్పుగా మీరు చేసేది. మర్డర్ అని చెప్పడానికి ఈ లెటర్ కీలక ఆధారం. అలాంటి లెటర్‌ను దాచి పెట్టడం ఇంకా పెద్ద నేరం. పోనీ దాచిపెట్టారు. తర్వాతైనా పోలీసులకు ఆ లెటర్ సంగతి చెప్పి ఇవ్వొచ్చు కదా. మీరు ఎందుకు పోలీసులకు చెప్పలేదు. ఎందుకు ఫోన్ చేసి చెప్పలేదు. ఆరున్నరకు శివప్రకాష్ నాకు ఫోన్ చేసిన తర్వాత వెళ్లి అరౌండ్ 6.45కి నేను పోలీసులకు ఫోన్ చేసి చెప్పాను. మీకు 6.10కే డెత్ న్యూస్ తెలుసు. వివేకా చనిపోయినట్టు 6.10కి తెలిసిన తర్వాత లెటర్ తెలిసిన తర్వాత అందులో కంటెంట్ కృష్ణారెడ్డి మీకు చదివి వినిపించిన తర్వాత అది మర్డర్ అని తెలిసిన తర్వాత ఎందుకు పోలీసులకు చెప్పలేదు. నన్ను వెళ్లమన్నప్పుడైనా చెప్పాలి కదా. నాపై నమ్మకం లేకపోతే నన్ను ఎందుకు వెళ్లమని చెప్పారు. అంటే మీ ఉద్దేశాలు తప్పు. మీ సైడ్ తప్పు ఉంది. కాబట్టే కావాల్సి లెటర్ విషయాన్ని, మర్డర్ విషయాన్ని దాచి పెట్టారు. ఊరికే నన్ను వెళ్లమని చెప్పారు. నేను సీఐకి ఫోన్ చేసి వివేకానందరెడ్డి చనిపోయారు. చాలా బ్లడ్ ఉంది. నేను సీఐకి చెప్పింది ఇదే. అని వీడియోను ముగించారు. ఈ వీడియో ముగింపు చూస్తుంటే మరికొన్ని వీడియోలు బయటకు వచ్చేలా ఉన్నాయి.

## బీసీలకు స్వర్ణయుగం తెస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పోరాడాలి. ఉప కులాల వారీగా ముందు నియోజకవర్గం స్థాయిలో, ఆ తరువాత మండల స్థాయిలో కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేస్తాం. బోయ, వాల్మీకి లను జగన్ నమ్మించి మోసం చేశారని అన్నారు.

ఎన్నో సార్లు జగన్ ప్రధానిని కలిశారు. ఒక్క సారి అయినా బోయ, వాల్మీకి లను ఎస్టీల్లో చేర్చాలని అడిగారా? అంత మంది ఎంపిలు ఉన్నారు ఒక్క రోజైనా పార్లమెంట్ లో ఈ అంశం గురించి మాట్లాడారా?టిడిపి హయాంలో సత్యపాల్ కమిటీ వేసి అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాం. జగన్ నాలుగేళ్లుగా డ్రామాలు ఆడి ఇప్పుడు కేవలం 4 జిల్లాలో ఉన్న బోయ, వాల్మీకి లను ఎస్టీల్లో చేర్చాలని కొత్త తీర్మానం చేసి మీకు తీరని అన్యాయం చేశారు.కల్లుగీత కార్మికుల పొట్ట కొట్టాడు జగన్. చెట్లను కొట్టేయడం తో పాటు అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. జగన్ సొంత మద్యం అమ్ముకోవడానికి కల్లు గీత కార్మికులను ఇబ్బంది పెడుతున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నీరా కేఫ్ లు ఏర్పాటు చేస్తాం. మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పిస్తాం. చెట్ల పెంపకం కోసం సహాయం అందిస్తాం. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు రజకులకు వాషింగ్ మెషీన్, ఐరెన్ బాక్సులు అందజేసాం. దోబి ఘాట్స్ ఏర్పాటు చేశాం. ఉచిత విద్యుత్ అందజేసాం. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వాషింగ్ మెషీన్ తో పాటు రజకులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తామని అన్నారు.

రజకులకి ఎమ్మెల్సీ ఇస్తానని మోసం చేసింది జగన్. మంత్రాలయం లో మత్స్యకారులను వేధిస్తున్నాడు ఇక్కడ ఎమ్మెల్యే విష నాగని అన్నారు. వైసిపి పెత్తందారుల చేతిలోకి వెళ్లిపోయిన చెరువులు అన్ని తిరిగి మత్స్యకారులకు కేటాయిస్తాం. మత్స్యకారుల పొట్ట కొట్టేలా జగన్ తెచ్చిన జీఓ లు అన్ని రద్దు చేస్తామని అన్నారు. బీసీలకు నిజమైన రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది టిడిపి వలనే. బిసిలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించింది టిడిపి. ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించాం. ఆదరణ 2 లో కొన్న పనిముట్లు బిసిలకు ఇవ్వకుండా వాటిని తుప్పు పట్టేలా చేసింది జగన్ ప్రభుత్వం. జగన్ స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు కట్ చేసి 16,500 మంది బీసీలను పదవులకి దూరం చేశారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల మంది బీసిలపై కేసులు పెట్టి వేధించారు. జగన్ పాలనలో బీసీలకు కుల ధృవీకరణ పత్రం తీసుకునే హక్కు కూడా లేకుండా పోయింది. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే గొర్రెల కాపరులను ఆదుకుంటాం. గొర్రెలు కొనడానికి సబ్సిడీ రుణాలు అందిస్తాం. మందులు, దాణా, మేత సబ్సిడీ లో అందిస్తాం. ఇన్స్యూరెన్స్ పథకం అమలు చేస్తాం. కనకదాస జయంతిని రాష్ట్ర పండుగ గా జరపాలని నిర్ణయం తీసుకున్నాం. బీరప్ప దేవాలయాలు నిర్మాణం కోసం సహాయం చేస్తాం. అర్చకులకు గౌరవ వేతనం కూడా అందిస్తాం. వడ్డెర కులస్తులను జగన్ ప్రభుత్వం వేధిస్తుంది. టిడిపి హయాంలో వడ్డెర కులస్తులకు కేటాయించిన మైన్లను జగన్ ప్రభుత్వం లాక్కుంది. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే మీ మైన్ల ను మీకు తిరిగి ఇస్తాం. పాలిచ్చే ఆవుని వద్దనుకొని, తన్నే దున్నపోతు తెచ్చుకున్నారు. జగన్ ని నమ్మి మోసపోయారు టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే బిసిలకు స్వర్ణయుగం తెస్తామని అన్నారు.

## 15 రోజుల్లో 4 లక్షల కోట్లు జమ చేసిన జనం

**ముంబాయి**



బ్యాంకుల్లో నగదు డిపాజిట్ల వరద ప్రవహిస్తోంది. వద్దంటే డబ్బు వచ్చి చేరుతోంది. కేవలం 15 రోజుల్లోనే రూ. 4 లక్షల కోట్లకు పైగా క్యాష్ డిపాజిట్లు బ్యాంకుల్లోకి వచ్చాయి. డిపాజిట్లపై వడ్డీ రేట్ల పెంపు కారణంగా, టర్మ్ డిపాజిట్ల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. దీంతో, ఆ మార్గంలో పెట్టుబడులు పెరిగాయి. గత సంవత్సరం నవంబర్ నెలలో... ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు డ అఖాలతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఖీఃఐ) ఒక సమీక్ష జరిపింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల వద్ద ఉన్న డిపాజిట్ల గురించి ఆ సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. దేశంలో రుణ డిమాండ్‌తో పోలిస్తే డిపాజిట్ వృద్ధి క్షీణించడంపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. రుణ డిమాండ్‌కు అనుగుణంగా నగదు లభ్యత ఉండేలా చూసుకోవాలని, డిపాజిట్ల సేకరణ పెంచాలని ఆయన సూచించారు. గవర్నర్ సూచనకు అనుగుణంగా, బ్యాంకులు తమ డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచడం ప్రారంభించాయి. బ్యాంకులు తీసుకున్న ఈ నిర్ణయం ప్రభావం చూపడం ప్రారంభించింది, డిపాజిట్లలో క్రమంగా వృద్ధి కనిపించింది. ప్రస్తుతం వడ్డీ రేట్లు గరిష్ట స్థాయిలో ఉండడంతో, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడుల పట్ల జనం ఆకర్షితులవుతున్నారు. ఈ విధంగా, కేవలం 15 రోజుల్లోనే రూ. 4 లక్షల కోట్లకు పైగా డిపాజిట్ల సేకరించి, బ్యాంకులు విజయం సాధించాయి. గత కొన్ని నెలలుగా బ్యాంకుల క్రెడిట్ డ డిపాజిట్ల మధ్య అంతరం పెరుగుతోంది. రుణాల కోసం ఉన్నంత డిమాండ్ బ్యాంక్ డిపాజిట్ల మీద లేదన్న లెక్కలు వెలువడ్డాయి. ఇది ఇలాగే కొనసాగితే, రుణాలు ఇవ్వడానికి బ్యాంకుల వద్ద నగదు లేని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. ఆర్‌బీఐ రెపో రేటును పెంచిన తర్వాత, అన్ని బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీ రేట్లను అదే వేగంతో పెంచకపోవడం వల్ల కూడా ఈ కొరత ఏర్పడింది. శక్తికాంత దాస్ సమీక్ష తర్వాత, 2023లో, బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచాల్సి వచ్చింది. ఇప్పుడు, దీర్ఘకాలిక టర్మ్ డిపాజిట్లపై 8 శాతం నుంచి 8.50 శాతం వరకు వడ్డీ రేట్లను బ్యాంకులు అందిస్తున్నాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు డిపాజిట్లపై వడ్డీ రేట్లను 9 నుంచి 9.50 శాతం వరకు అందిస్తున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో, రెపో రేటును 4 శాతం నుంచి 6.50 శాతానికి రిజర్వ్ బ్యాంక్ పెంచింది. బ్యాంకులు అదే స్థాయిలో రేట్లను పెంచకపోవడంతో, పెట్టుబడిదార్లు తమ డబ్బును మంచి రాబడి కోసం మ్యూచువల్ ఫండ్లలోకి మళ్లించారు. పోస్టాఫీస్ చిన్న మొత్తాల పొదుపు పథకాలు కూడా మెరుగైన వడ్డీ రేట్లను అందిస్తుండడంతో అటువైపు మరికొన్ని పెట్టుబడులు వెళ్లాయి. దీంతో, గత కొన్ని నెలల్లో క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తి 69 శాతంగా ఉంది. వడ్డీ రేట్ల తీరు మారిన తర్వాత, ఇప్పుడు ఆ నిష్పత్తి 75 శాతానికి చేరింది. ఈ ఏడాది తొలి పక్షం రోజుల్లో బ్యాంకులు సేకరించిన డిపాజిట్లు రూ. 184.5 లక్షల కోట్లు కాగా, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 10.2 శాతం ఎక్కువ. ఇదే కాలంలో, 15.7 శాతం వృద్ధితో రూ. 138.5 లక్షల కోట్ల రుణాలు ఇచ్చాయి. భారత ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్, 2023-24 బడ్జెట్‌లో, 'మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' పేరుతో మహిళల కోసం ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రకటించారు. రెండేళ్ల కాలవ్యవధి ఉండే ఈ పథకం డిపాజిట్లపై 7.5 శాతం వార్షిక వడ్డీని ప్రకటించారు. సీనియర్ సిటిజన్ల డిపాజిట్ పథకంలోనూ పెట్టుబడి పరిమితిని రెట్టింపు చేసి రూ. 15 లక్షల నుంచి రూ. 30 లక్షలకు పెంచారు. ఇందులో సీనియర్ సిటిజన్లకు ఏడాదికి 8% వడ్డీ లభిస్తుంది. ఈ రెండు ప్రకటనల తర్వాత, మిగిలిన డిపాజిట్ పథకాలపై వడ్డీ రేట్లను కూడా ఆకర్షణీయంగా మార్చాలని బ్యాంకులపై ఒత్తిడి పెరిగింది.

# నెల్లిమర్లలో బొత్సకు ఇంటి పోరు

**విజయనగరం:**



విజయనగరం జిల్లా పేరు చెబితే ఠక్కున గుర్తుకొచ్చే నేతలలో బొత్స సత్యనారాయణ ఒకరు. రాజకీయ నేపథ్యం ఏ మాత్రం లేని కుటుంబం నుంచి వచ్చిన బొత్స.. అంచెలంచెలుగా ఎదిగి, జిల్లా రాజకీయాలనే శాసించగల స్థాయికి చేరుకున్నారు. కాపు సామాజిక వర్గంలో బలమైన నేతగా గుర్తింపు పొందిన ఆయనకు పార్టీలకు అతీతంగా మంచి పేరు ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే మంత్రిగా పని చేశారు. పీసీసీ అధ్యక్షుడిగానూ ఎదిగారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి మరణం తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో ఒకానొక దశలో ఆయన ముఖ్యమంత్రి అవుతారని కూడా అంతా భావించారు. అయితే, ఆ అవకాశం త్రుటిలో చేజారింది.బొత్స సమైక్యాంధ్ర ఉద్యమం సమయంలో కాస్త గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఆయన పనైపోయిందనే అంతా భావించారు. కానీ, పడి లేచిన కెరటంలా దూసుకొచ్చారు. వైఎస్ఆర్ సీపీలో చేరారు. ఆ పార్టీ అధికారంలోకి రావడంతోనే జిల్లా నుంచి ఏకైక మంత్రిగా పురపాలక పట్టణాభివృద్ధి శాఖ బాధ్యతలు స్వీకరించారు. కోల్పోయిన వైభవం తిరిగి సాధించడంలో ఆయన మేనల్లుడు, ప్రస్తుత జిల్లా పరిషత్తు ఛైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అయిన మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) పాత్రను కొట్టిపారేయలేం.కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచీ మంత్రిగా బొత్స ఉన్నా.. జిల్లా రాజకీయాలను ప్రభావితం చేసింది చిన్న శ్రీను అనే చెప్పవచ్చు. ఒక విధంగా చెప్పాలంటే బొత్సకు కుడి భుజంగా ఉన్నారు. ఇన్నాళ్లు తెరవెనుక రాజకీయాలు నడిపిన శ్రీను.. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చి, జడ్పీ ఛైర్మన్‌గా పదవి చేపట్టిన తర్వాత.. బొత్సకు దూరమయ్యారని ప్రచారం జరుగుతోంది. పేరుకు మంత్రి బొత్స అయినా.. జిల్లాలో పెత్తనమంతా చిన్నశ్రీనుదే. అటు రాజకీయాలు, ఇటు అధికార యంత్రాంగాన్ని శాసించడంలో ఆయనదే కీలక పాత్ర. చాలా వరకూ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆయననే ఫాలో అవుతున్నారు. ఒకనొక దశలో మంత్రిని పూర్తిగా పక్కనపెట్టేశారన్న ప్రచారం నడిచింది. సత్తిబాబు కంటే చిన్నశ్రీను దగ్గరికి వెళ్తేనే పని అవుతుందన్న నమ్మకం అందరిలోనూ పెరిగింది. ఈ పరిణామాలు బొత్స సత్యనారాయణకు మింగుడుపడలేదు. బొత్సతో పొసగని నేతలను చిన్నశ్రీను చేరదీస్తున్నారు. తనకంటూ ఓ వర్గాన్ని సృష్టించుకుంటున్నారు. మంత్రి బొత్సకు వరసకు మేనల్లుడు అయ్యే బడ్డుకొండ అప్పలనాయుడు నెల్లిమర్ల ఎమ్మెల్యేగా ఉన్నారు. అక్కడ బొత్స సొంత తమ్ముడు లక్ష్మణరావు.. ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా వర్గం నడుపుతున్నారు. స్థానిక ఎన్నికల సమయంలో పూసపాటిరేగలో ఈ ఇద్దరి మధ్య బహిరంగంగానే వాగ్వాదం జరిగింది. లక్ష్మణరావు తనను ఇబ్బంది పెడుతున్నారని బడ్డుకొండ అప్పల నాయుడు అధిష్టానానికి ఫిర్యాదు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో నెల్లిమర్ల నుంచి తాను పోటీ చేయడం గానీ, తన కొడుకును గానీ పోటీలో ఉంచాలని బొత్స లక్ష్మణరావు భావించారు. అందులో భాగంగా కొన్నాళ్లు దూకుడుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే అప్పలనాయుడికి వ్యతిరేకంగా శిబిరం నడిపారు. లక్ష్మణరావును అదుపు చేయాలని అప్పలనాయుడు అప్పట్లో బొత్సను కూడా కోరారు. తర్వాత లక్ష్మణరావు స్పీడు తగ్గినా నెల్లిమర్ల నియోజకవర్గంలో బొత్స వర్సెస్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నట్టుగా పరిస్థితి మారింది. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకి చిన్న శ్రీను బావ అవుతారు. ఇప్పుడు ఆ బంధం కాస్త వియ్యంకులుగా మారింది. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో బొత్స – చిన్నశ్రీనులు ఎడమొహం పెడమొహంగా ఉంటున్నారని ఆ పార్టీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రత్యేక సందర్భంలో తప్పితే.. ఇద్దరూ కలసి కార్యక్రమాల్లో పాల్గొంటున్నది లేదు. ఇటీవల జరిగిన చిన్నశ్రీను కుమార్తె వివాహంలోనూ బొత్స కనిపించలేదు. ఇద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయన్న టాక్ జిల్లాలో నడుస్తోంది. ఇద్దరూ విడిపోతే పార్టీకే నష్టమని శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. కేడర్లో బలమైన ముద్ర వేసుకున్న చిన్న శ్రీనును కాదని బొత్స సత్తిబాబు ఏమి చేసే పరిస్థితి లేదు. అలాగని బొత్స సత్తిబాబుకు దూరమై రాజకీయాలు చేసే పరిస్థితి చిన్న శ్రీనుకు ఉండదని పలువురు నాయకులు అభిప్రాయపడుతున్నారు. అసలు వీరి మధ్య వివాదానికి కారణమేమిటన్న విషయంపైనా ఎక్కడా స్పష్టత లేదు. అసలు వివాదం ఉందా, లేదా అన్నది కూడా తెలియదు. ప్రస్తుతం మజ్జి శ్రీనివాసరావు విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగానూ ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన అసెంబ్లీ బరిలో దిగాలని ఆలోచిస్తున్నారు. అందుకనుగుణంగా ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని ఎస్.కోట, చీపురుపల్లి, శ్రీకాకుళం జిల్లా లోని ఎచ్చెర్ల నుంచి పోటీ చేసే ఆలోచనలో శ్రీనివాస రావు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతానికైతే చీపురుపల్లి నియోజక వర్గంలోనే ఎక్కువగా పర్యటిస్తున్నారు. అయితే, ప్రస్తుతం ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే బొత్స కావడం విశేషం. వచ్చే ఎన్నికల సమయానికి బొత్సను రాజ్యసభకు పంపుతారన్న ప్రచారం ఉంది. ఇదే సమయంలో బొత్స కుమారుడు సందీప్ ను ఈ నియోజక వర్గం నుంచి బరిలోకి దించే అవకాశాలూ లేకపోలేదు. ఏదేమైనప్పటికీ.. చిన్న శ్రీను సైలెంట్‌గా తన పని తాను చేసుకుపోతున్నారు. ఇదే సందర్భంలో మిగిలిన నియోజకవర్గాలపైనా తనదైన శైలిలో రాజకీయ చతురతను కనబరుస్తూ దూకుడుగా వెళ్తున్నారు. ఎన్నో ఏళ్లుగా రాష్ట్ర రాజకీయాల్లోనే కీలకంగా ఉన్న బొత్సకు.. ఇప్పుడు సొంత కుటుంబంలోని పరిణామాలు తలనొప్పిగా మారాయి. దీన్ని తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో టీడీపీ నేతలు ఉన్నారు.

# 28 తర్వాత ప్రభుత్వంపై పోరాటమే

**విజయవాడ :**

రాష్ట్ర ఆదాయం మొత్తం ఉద్యోగుల జీతాలకే సరిపోతోందన్న ప్రభుత్వ వాదనపై ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్త చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆదాయం లక్ష కోట్ల రూపాయలు అయితే ఉద్యోగులకే రూ. 90 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పడం దారుణమని బొప్పరాజు వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం ఆయన కాకినాడ లో ఉద్యోగులు నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్నారు. వాలంటీర్ల జీతాలతో పాటు ఏపీ ఉద్యోగులకు చెల్లించే మొత్తం రూ.60 వేల కోట్లకు మించి ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని విమర్శించారు.ఇప్పటికైనా ఉద్యోగులందరూ నిర్లక్ష్యం వహించకుండా ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమంలో పాలుపంచు కోవాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపిచ్చారు. ఉద్యమించకుంటే ప్రతి ఉద్యోగి తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే జీతాలు సరైన సమయానికి పడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈనెల 28న రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం విజయవాడలో నిర్వహిస్తున్నామని, అందరూ హాజరు కావాలని కోరారు.ఇతర ఉద్యోగ సంఘాలు కలిసి రాకపోయినా బొప్పరాజు మాత్రం పూర్తి స్థాయిలో పోరాటం చేస్తున్నారు. ఉద్యోగుల మలిదశ ఉద్యమం ఓర్పుతో సాగుతోందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి చాలా సమయం ఇచ్చామని స్పష్టం చేశారు. ఉద్యమం తీవ్రమైతే తాము బాధ్యులం కాదని అన్నారు. డిమాండ్ల పరిష్కారానికి 47 రోజులుగా నిరసనలు తెలుపుతున్నామని బొప్పరాజు వివరించారు. రెండుసార్లు మంత్రివర్గ ఉపసంఘంతో భేటీ అయ్యామని, కానీ సమావేశాలతో ఎలాంటి పరిష్కారం లభించలేదని తెలిపారు. ఉద్యమ నేపథ్యంలో, ఈ నెల 28న ఏపీ ఎన్జీవోలు, ట్రేడ్ యూనియన్లతో సమావేశం అవుతున్నట్టు బొప్పరాజు వెల్లడించారు. పీఆర్సీ, డీఏ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని, పాత బకాయిలు ఎన్నేళ్లకు ఇస్తారో తెలియడంలేదని బొప్పరాజు వాపోతున్నారుఈ నెల 28 నుంచి కార్మిక, టీచర్స్, సంఘాలతో కలిసి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తున్నామని బొప్పరాజు చెబుతున్నారు. తాము చాలా ఓపికతో సహనంతో ఉద్యమాన్ని చేస్తున్నామన్నారు. తెలంగాణాలో ఒక్క డీఏ పెండింగ్‌లో లేదని, కానీ ఏపీ లో ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి డీఏ ఊసే లేదన్నారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర అంశాలపై సమస్యలు పెంచే కొద్ది పెరుగుతూనే ఉంటాయని పరిష్కారం కావాలని ఆనయంటున్నారు.

# సైకిల్ ఎక్కనున్న శైలజానాథ్

**అనంతపురం:**



అనంతపురం జిల్లాలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. మాజీ మంత్రి టీడీపీలో వస్తారంటూ సరికొత్త ప్రచారం మొదలైంది. మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఇంటికి వెళ్లడం చర్చనీయాంశమైంది. జేసీ దివాకర్ రెడ్డి దాదాపు గంటపాటు శైలజానాథ్‌తో చర్చలు జరిపారు. శైలజానాథ్ ఆహ్వానం మేరకే జేసీ ఆయన నివాసానికి వెళ్లారని చెబుతున్నారు. శైలజానాథ్ టీడీపీలోకి వస్తారని స్థానికంగా చర్చ జరుగుతోంది. జేసీ, శైలజానాథ్‌లు మాత్రం ఎలాంటి కామెంట్స్ చేయలేదు.సాకే శైలజానాథ్ మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఆయన శింగనమల నియోజకవర్గం నుంచి 2004, 2009లో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత ప్రాథమిక విద్యాశాఖ, పాఠ్యపుస్తకాలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. శైలజానాథ్ 2022 జనవరి నుంచి 2022 నవంబర్ వరకు ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్‌గా పనిచేశారు. జేసీ దివాకర్ రెడ్డి, సాకే శైలజానాథ్‌లు గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేశారు. 2014 ఎన్నికల సమయంలో జేసీ బ్రదర్స్ టీడీపీలో చేరగా.. శైలజానాథ్ మాత్రం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు.ఇదిలా ఉంటే మాజీ మంత్రి రఘువీరా రెడ్డి కూడా మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అవుతున్నారు. ఇప్పటికే కర్ణాటక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి తాను రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుందామని భావించానని.. కానీ తాజా పరిణామాలతో తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు చెప్పారు. అందుకే రాజకీయాల నుంచి తప్పుకోవడం భావ్యమా అని ఆలోచించినట్లు చెప్పారు. అన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రఘువీరారెడ్డి కూడా మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మడకశిర నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగింది.. దీంతో ఆయన నియోజకవర్గం మారారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. అలాగే వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో రఘువీరారెడ్డి వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా పనిచేసి కొణిజేటి రోశయ్య ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన సంగతి తెలిసిందే. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలోనూ మంత్రిగా పనిచేశారు. విభజన తర్వాత ఏపీకి పీసీసీ ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు.ఇటీవలే రాయలసీమ నేతలంతా సమావేశమయ్యారు.. అక్కడ కూడా జేసీ, శైలజానాథ్ మాట్లాడుకుంటూ కనిపించారు. అంతేకాదు రాయలసీమను తెలంగాణ పేరుతో జేసీ దివాకర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాయల తెలంగాణ ఏర్పాటు చేయాలని.. అప్పుడే రాయలసీమ సాగునీటి సమస్య తీరుతుందని వ్యాఖ్యానించారు. ప్రత్యేక రాయలసీమ వచ్చినా సంతోషమేనని.. అలాగే రాయల తెలంగాణ అయినా ఫర్వాలేదన్నారు. ఈ రాయల తెలంగాణ నినాదానికి తనవంతుగా మద్దతు కూడగడతానని కామెంట్ చేశారు. తెలంగాణలో రాయలసీమను కలుపుకోవాల్సిన అవసరం సీఎం కేసీఆర్‌కు ఉందన్నారు.

# పవన్ లేఖకు అర్థం ఏమిటే...

**ఏలూరు:**



జనసేన కార్యకర్తలను ఉద్దేశించి పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తాజాగా బహిరంగ లేఖ రాశారు. అందులో పార్టీ విధానాలు.. కార్యకర్తలు, నేతలు వ్యవహరించాల్సిన తీరు.. ఎలా స్పందించాలన్న అంశాలను వివరించారు. తాను చెప్పిన విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించారు. అంత వరకు బాగానే ఉన్నా? పవన్ చేసిన సూచనలే ఇప్పుడు చర్చకు దారి తీస్తున్నాయట. జనసేనకు ఉన్న క్రెడిబిలిటీని దృష్టిలో పెట్టుకుని చాలా మంది వివిధ అంశాలను పార్టీ నేతల దృష్టికి తెస్తున్నారని..ఆర్థిక నేరాలపై స్పందించేటప్పుడు వాటిని పూర్తి స్థాయిలో నిర్ధారణ చేసుకుని.. అలాగే డాక్యుమెంట్ సహా సాక్ష్యాధారాలు ఉంటేనే మాట్లాడాలని సూచించారు. అది కూడా ముందు పార్టీ అధినాయకత్వం దృష్టికి తేవాలని స్పష్టం చేశారు. అలాగే విమర్శలు చేసే సందర్భంలో ప్రత్యర్థి పార్టీకి చెందిన నేతల కుటుంబ సభ్యుల పేర్లను ప్రస్తావించవద్దని ఆదేశించారు. మరీ ముఖ్యంగా పొత్తుల విషయమై మాట్లాడేటప్పుడు.. స్పందించే సందర్భంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పుడు ఇవే అంశాలపై పార్టీ కేడర్ ఆసక్తికర చర్చ జరుగుతోందట.సరైన పత్రాలు లేకుండా ఎవరిపైనా ఆర్థిక నేరారోపణలు చేయొద్దని ఎందుకన్నారనేది ఓ ప్రశ్న. ఇది మంచి విధానమే అయినా.. రాజకీయ పార్టీగా ఆచరణలో ఎంత వరకు ఇది సాధ్యమనే ప్రశ్న వస్తోందట పార్టీ నాయకులకు. ప్రస్తుతం ఉన్న పోటీ రాజకీయాల్లో ఈ విధంగా ఉండడం సాధ్యమయ్యే పనేనా అనే చర్చ జరుగుతోందట. జనసేనకు ఉన్న క్రేజ్ ను ఎవరైనా నేతలు.. తమ వ్యక్తిగత లబ్ది కోసం వాడుకుంటున్నారనే సమాచారంతో దానికి చెక్ చెప్పడానికే పవన్ ఈ తరహా సూచన చేశారా..? అన్న అనుమానాలు కూడా వస్తున్నాయట. ఇక ఇదే సందర్భంలో పవన్ కేసులకు భయపడుతున్నారా..? అనవసరంగా కేసులు పెట్టించుకుని ఇబ్బందులు పడటం ఎందుకనుకుంటున్నారా? లేక రాద్ధాంతం ఎందుకని భావిస్తున్నారా..? అనే చర్చ కూడా రాజకీయ వర్గాల్లో జరుగుతోందట. సాధ్యాసాధ్యాల మాట ఎలా ఉన్నా?ఈ స్టాండ్ మీద నిలబడిగలిగితే మాత్రం ప్రస్తుత రాజకీయాల్లో పవన్‌కళ్యాణ్ ట్రెండ్ సెట్ చేస్తారనే చెప్పొచ్చంటున్నారు.మరోవైపు పొత్తుల గురించి సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని.. ఆధారం చేసుకుని మాట్లాడొద్దని.. తమతో సయోధ్యగా ఉన్న రాజకీయ పార్టీల్లోని చిన్న చితక నేతలు ఏమైనా విమర్శలు చేసినా.. దాన్ని లైట్ తీసుకోవాలని.. ఆయా పార్టీల విధానాలుగా భావించొద్దని.. స్పష్టం చేశారు జనసేనాని. ఇప్పుడిదే చర్చనీయాంశం అయింది. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలు బీజేపీని ఉద్దేశించినవా..? లేక టీడీపీని ఉద్దేశించి చేశారా..? అనే చర్చ మొదలైంది. ప్రస్తుతానికి టీడీపీ, బీజేపీల్లోని నేతలు ఎవరూ పవన్ ఉద్దేశించి ఎలాంటి నెగెటివ్ కామెంట్లు చేయడంలేదు. కానీ.. టీడీపీ-జనసేన పొత్తు దాదాపు ఖరారు అయిందని.. ఇక సీట్ల పంపకమే తరువాయన్న ప్రచారం నిజమేనన్న అభిప్రాయం పవన్ లేఖ ద్వారా స్పష్టం అవుతోందంటున్నారు. వ్యతిరేక కామెంట్స్ చేయవద్దని కేడర్‌కి సూచించింది కూడా టీడీపీ విషయంలోనే అనే అభిప్రాయం కూడా ఉందట. సీట్ల పంపకంలో భాగంగా తమకు అవకాశంరాని నేతలు అసంతృప్తిగా ఉంటారు.. వారు ఆ సందర్భంలో మీడియాతో మాట్లాడుతూ ఏదోఒక వ్యతిరేక వ్యాఖ్య చేస్తారని, అందుకే ముందు జాగ్రత్తగా పవన్ ఇలా సూచనలిచ్చారన్న మరో వాదన కూడా ఉంది.నేతలు చేసే కామెంట్ల ప్రభావం పొత్తులపై పడకుండా.. ఓట్ షేరింగ్‌లో ఇబ్బందులు రాకుండా జాగ్రత్త పడటంలో ఇది తొలి అంకంగా భావిస్తున్నారట. ఇదే సందర్భంలో టీడీపీ-జనసేన మధ్య గ్యాప్ పెంచేలా సోషల్ మీడియాలో జరిగే ప్రచారంతో జనసేన కార్యకర్తలు ఆవేశంతో ఊగిపోతే.. అది మరింత నష్టం కలిగిస్తుందని, అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే పవన్ ఈ తరహా జాగ్రత్తలు తీసుకుంటున్నారనేది పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న మాట. మొత్తంగా ఎన్నికలు దగ్గరపడుతున్న టైంలో తన పార్టీ కార్యకర్తలకు పవన్ చేసిన ఈ సూచనలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. నిజంగానే వీటిని ఆచరణలో పెట్టగలిగితే మాత్రం ఇవాళ్టి రాజకీయ పరిస్థితుల్లో ట్రెండ్ సెట్టర్స్ అవుతారంటున్నారు విశ్లేషకులు.

# గర్భిణీ పై దాడి–.శిశువు మృతి

**అచ్చంపేట**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రభుత్వ అస్పత్రి సిబ్బంది అమానవీయంగా ప్రవర్తించారు. డెలివరీ కోసం వచ్చిన గర్భిణీకి నొప్పులు రావడం లేదని చేతులు, ముఖంపై కొట్టారు. కడుపుపై బలంగా కొట్టడంతో శిశువు మృతి చెందింది. మృత శిశువును బయటకు తీసే ప్రయత్నంలో తల్లి తీవ్ర రక్త స్రవానికి గురైంది.దీంతో బంధువులు బుధవారం అస్పత్రి ముందు ఆందోళనకు దిగారు.

నాగర్ కర్నూలు జిల్లా పదర మండలం చిట్లంకుంట గ్రామానికి చెందిన మంజుల తొలి కాన్పు కోసం మంగళవారం సాయంత్రం అచ్చంపేట ప్రభుత్వ అస్పత్రిలో అడ్మిట్ అయ్యింది. బుధవారం ఉదయం వరకు నొప్పులు రాకపోవడంతో డ్యూటీలో ఉన్న సిస్టర్లు మంజుల ముఖం, చేతుల మీద గట్టిగా కొట్టారని భర్త ఆరోపించాడు. డాక్టర్ వచ్చి చూసి వెళ్లిందే తప్ప ట్రీట్మెంట్ గురించి, పెద్ద హాస్పిటల్ కు పంపిస్తామని చెప్పలేదని వాపోయాడు. కడుపుపై గట్టిగా కొట్టడంతో లోపల శిశువు మరణించిందని ఆవేదన వ్యక్తం చేశాడు. మృత శిశువును బయటకు తీసేందుకు కూడా సరిగ్గా ప్రయత్నించలేదని, విపరీతంగా రక్త స్రావానికి గురైందని ఆరోపించాడు.డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతి చెందిందని ఆరోపించారు.రాత్రి 11 గంటల ప్రాంతంలో మంజుల కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి బిజెపి, ఎమ్మార్పిస్ నేతలు వీధుల పట్లా నిర్లక్ష్యం వ్యవహరించి నవజాత శిశు మృతికి కారకులైన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అర్ధరాత్రి వరకు ఆసుపత్రిముందు ఆందోళన చేపట్టారు.

# ఆందోళనలో పాలిటెక్నిక్ స్టూడెంట్స్

**హైదరాబాద్ :**

సాంకేతిక విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగా తాము అకడమిక్ ఇయర్ నష్టపోవాల్సి వస్తోందని పాలిటెక్నిక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఓ వైపు పరీక్షలు జరుగుతుంటే అన్ని అర్హతలు ఉండి, అన్ని రకాల ఫీజులు చెల్లించిన తమను పరీక్షకు అనుమతి ఇవ్వడం లేదని ఆరోపిస్తూ మాసబ్ ట్యాంక్‌లోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ కార్యాలయం ఎదుట ఫైనల్ ఇయర్ విద్యార్థులు గత రెండు రోజులుగా ఆందోళనకు దిగారు. పాలిటెక్నికల్ పరీక్షలు ప్రారంభం కావడంతో కొంత మంది విద్యార్థులకు హాల్ టికెట్లు డౌన్ లోడ్ అవ్వగా మరి కొంత మందికి డౌన్ లోడ్ అవ్వలేదు. ఇదే విషయంపై పలు మార్లు హాల్ టికెట్ల కోసం కాలేజీల్లో అడిగామని, చివరి నిమిషం వరకు హాల్ టికెట్లు వస్తాయని చెప్పిన కాలేజీ సిబ్బంది పరీక్షలు ప్రారంభమైన రోజున మీరంతా డిటెండ్ అయ్యారని సమాచారం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.చివరి నిమిషంలో ఇలా చెప్పడం ఏంటని ప్రశ్నించిన విద్యార్థులకు ఇదంతా తమ చేతుల్లో లేదని సాంకేతిక విద్యాశాఖ చేతుల్లో ఉందని చెప్పడంతో తామంతా పరీక్షలు రాయకుండానే ఎస్ బీటీఈటీ కార్యాలయం వద్దకు వచ్చామని చెబుతున్నారు. తమ డిటెండ్‌పై అడిగేందుకు వచ్చిన తమతో ఇక్కడి అధికారులు నిర్లక్ష్యంగా సమాధానాలు చెబుతున్నారని.. జరిగిందేదో జరిగిపోయింది, బ్యాక్ లాగ్స్ ఏవైనా ఉంటే ఈసారికి క్లియర్ చేసుకుని వచ్చే ఏడాదిలో చివరి సంవత్సరం పరీక్షలు రాసుకోవాలని చెబుతున్నారని ఆవేదన చెందుతున్నారు.60 శాతం అటెండెన్స్ ఉన్న తమను పరీక్షకు అనుమతించకుండా 30 శాతం అటెండెన్స్ ఉన్న కొంత మంది విద్యార్థులకు మాత్రం హాల్ టికెట్లు జారీ చేసి పరీక్షలకు అనుమతి ఇస్తున్నారని, సాంకేతిక లోపం వల్లే హాల్ టికెట్ల జారీ విషయంలో తప్పిదం జరిగిందనే అనుమానాలు తమకు ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు. దీనికి బాధ్యులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. మరి ఈ విషయంలో ఉన్నతాధికారులు ఎలా రియాక్ట్ అవుతారనేది వేచి చూడాలి.

## మొక్కజొన్న రైతుల వినూత్న నిరసన

**అదిలాబాద్**

అదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని కస్తుర్ట గ్రామ మొక్క జొన్న రైతులు వినూత్న నిరసనలకు దిగారు. గ్రామ పంచాయతీకి తాళం వేసుకొని స్వీయ నిర్భంధంలో వుండిపోయారు. బుధవారం అర్ధరాత్రి నుండి మొక్క జొన్న రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన రైతులకు రెండు రోజులలో కొనుగోలు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అకాల వర్షాలతో పంటలు సైతం నేల మట్టం అవడంతో అపార నష్టం జరిగిందని రైతులు అంటున్నారు. పంటలు మద్దతు ధరలతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## సీఎం క్యాంప్ కార్యాలయంలో భగీరథ మహర్షి జయంతి కార్యక్రమం

**అమరావతి**

ముఖ్యమంత్రి కార్యాలయంలో గురువారం భగీరథ మహర్షి జయంతి కార్యక్రమం జరిగింది. భగీరథ మహర్షి చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమం, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఛైర్మన్ కర్నాటి రాంబాబు, ఏపీ సగర, ఉప్పర వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్పర్సన్ జి.రమణమ్మ, గిద్దలూరు వైఎస్ఆర్సీపీ పరిశీలకుడు బంగారు శీనయ్య తదితరులు పాల్గోన్నారు..

## అందరివాడు చిక్కాల

**కాకినాడ**

కుల,మతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా మెలిగే ప్రజా సేవకుడు చిక్కాల రామచంద్రరావు అని మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీగా పదవీ విరమణ చేయనున్న చిక్కాల రామచంద్రరావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అడుగడుగునా ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టడంతో ఐదుసార్లు తాళ్ళరేవు శాసనసభ్యునిగా, రెండుసార్లు మంత్రిగా పనిచేశారని అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఏదో చేయాలనే తపనతో పనిచేసిన నిరాడంబర రాజకీయ నేత చిక్కాల అని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ సమకాలీన రాజకీయ నాయకులలో చిక్కాలది ఒక ప్రత్యేక స్థానమని అన్నారు. మంత్రిగా పనిచేసినా ఎప్పుడూ నిరాడంబరంగా ప్రజలకు అందుబాటులో ఉండే వారని అన్నారు. విలువలతో కూడిన రాజకీయ నేతగా ఆయన పని చేస్తున్నారని అడబాల కొనియాడారు. చిక్కాల మాట్లాడుతూ కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు త్రికరణ శుద్ధిగా ప్రజలకు సేవ చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్ పట్నాయక్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, ఓం నమశ్శివాయ , డాక్టర్ శిరీష, అడబాల సత్యనారాయణ, పార్థసారథి ,రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా కార్పోరేటర్ కనపడడంలేదు

**విజయవాడ**



పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగక పోరాటం చేస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తు పై ముందు చూపు ఉన్న వ్యక్తి పవన్ కళ్యాణ్ రు మాత్రమేనని జనసేన నేత పోతిన మహేష్ అన్నారు. గురువారం నిర్వహించిన ఇంటింటికి రాబోయే మన జనసేన ప్రభుత్వం కార్యక్రమంలో అయన పాల్గోన్నారు. 35వ డివిజన్ అధ్యక్షులు నారాయణస్వామి ప్రదీప్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మహేష్ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇసుక విధానం వలన రాష్ట్ర భవిష్యత్తు నాశనం అవుతుందని ముందుగా గ్రహించి, ఇసుక పాలసీని వ్యతిరేకించి లాంగ్ మార్చ్ చేసిన ప్రజా నాయకుడు పవన్ కళ్యాణ్. సెంటు భూమి పథకం పేరుతో ప్రజల్ని మోసం చేసిన సీఎం జగన్. మాయ మాటలు చెప్పి ప్రజల్ని మోసం చేయడంలో సీఎం జగన్ దిట్ట. గెలిచిన తర్వాత వైసిపి కార్పొరేటర్ కనపడటం లేదని ప్రజలు ఆవేదనతో వున్నారని అన్నారు.

## పౌర సరఫరాల గొదాం పాయింట్ ను తనిఖీ

**ఏమ్మిగనూరు**

పట్టణంలోని పౌర సరఫరాల గొదాం పాయింట్ ను గురువారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న రేషన్ నిల్వ, రికార్డ్స్, భద్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం కార్డ్ లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో ఏటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జయన్న, ఎలక్షన్ ఉప తాసిల్దార్ గురు రాజారావు, మండల సర్వేయర్ అశోక్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొన్న కాణిపాకం - నేడు సింహాచలం

**విజయవాడ :**

చందనోత్సవం సందర్భంగా సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని సింహాద్రి అప్పన్న దేవస్థానం, అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఆరోపణలపై వివరణలు ఇచ్చుకుంటున్న ప్రభుత్వానికి మరో వివాదం చుట్టు ముట్టింది. సింహాంద్రి అప్పన్న స్వామి నిజరూప దర్శన వీడియో సోషల్ మీడియాలో కనిపించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వయంభూ మూర్తులు, మూలవిరాట్‌ను ఫొటోలు తీయడం కానీ, వీడియోలు తీయడం కానీ నిషేధం. అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటా ఉంటారు. అయితే మొన్న జరిగిన చందనోత్సవంలో భాగంగా దర్శనానికి వచ్చిన వ్యక్తుల్లో కొందరు వీడియో తీసి సోషల్ మీడియా పెట్టడం ఇప్పుడు దుమారం రేపుతోంది. గతేడాది కూడా ఇలానే కొందరు వ్యక్తులు నిజరూపాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఆ ఘటనపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు తాజాగా అలాంటి ఘటనే మళ్లీ జరిగింది. వరుసగా రెండేళ్లు ఇలా జరగడంపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోనూ రాష్ట్రమంత్రి గన్‌మన్ ఒకరు తీశారని ప్రచారంలో ఉంది. వీడియో తీస్తున్న విషయాన్ని గమనించిన దేవాదాయశాఖాధికారులు ఆయన సెల్‌ఫోన్ లాక్కున్నట్టు సమాచారం. అయినా వీడియో బయటకు రావడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జరిగినప్పుడే సీరియస్‌గా అధికారులు చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని అంటున్నారు సింహాద్రి అప్పన్న భక్తులు. చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరచూ వివాదాల కారణంగా వార్తల్లో నిలుస్తోంది. అధికారుల నిఘా వైఫల్యం బయటపడిందని భక్తులు మండిపడుతున్నారు. వైసీపీ నాయకుడు బాలవెంకటరెడ్డి యాదవ్ దంపతులు ఆలయానికి వచ్చారు. వారితో పాటు వచ్చిన అనుచరుడు ఒకరు దర్శన సమయంలో మూలవిరాట్ ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అధికారులు, అర్చకులు ఎవరూ దీన్ని అడ్డుకోలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణ భారతదేశంలో ప్రముఖ వాయు లింగ క్షేత్రంగా ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇటీవల సింగర్ మంగ్లీ చిత్రీకరించిన పాట వివాదాస్పదంగా మారింది. శ్రీకాళహస్తీ ఆలయంలోకి ఎటువంటి సెల్ఫోన్లు, కెమెరాలు, అనుమతించమంటూ ఆలయ అధికారులు, పాలక మండలి విధించిన ఆంక్షలు పక్కన పెట్టి ఆలయ అధికారులే మంగ్లీ పాటల చిత్రీకరణకు అనుమతించారు. ఆలయం లోపలికి కెమెరాలు తీసుకుని వెళ్లి పాట చిత్రీకరణ చేశారు. ముక్కంటి ఆలయం లోనే పాటలు చిత్రీకరణ రాహుకేతు సర్ప దోష పూజ మండపంలో, కాళభైరవ ఆలయం ముందు భాగంలో మంగ్లీ పాటను చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ పాట సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. జ్ఞానప్రశూంనాభ, వాయులింగేశ్వరుడి కొలువైవున్న కాళహస్తిలో సింగర్ మంగ్లీ బృందం శివరాత్రి పాట చిత్రీకరించారు. శివరాత్రికి పది రోజుల ముందు పాట షూట్ చేశారు. పాట చిత్రీకరణలో శ్రీకాళహస్తి ఆలయ ప్రధాన అర్చకులు అర్ధగిరిస్వామి, మిగిలిన స్వాములు కూడా ఉన్నారు. అసలు ఆలయంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, కెమెరాలు, సెల్ ఫోన్లు తీసుకు వెళ్లకూడదని నిషేధం ఉన్నా మంగ్లీ బృందం ఏ విధంగా ఆలయంలో పాటను చిత్రీకరించారని భక్తులు ప్రశ్నించారు.

# భారీగా పెరిగిన యూజర్ చార్జీలు

**నెల్లూరు :**

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో యూజర్ ఛార్జీలను పెంచారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మార్కెట్ విలువ సూచించే డాక్యుమెంట్‌కు రూ.10 నుంచి రూ.50కి పెరిగింది. ఈసీకి నుంచి రూ.100 ఛార్జీ వసూలు చేస్తారు. ఎన్ కంబరెన్స్ సర్టిఫికెట్ జారీకి రూ.10 నుంచి వందకు పెంచారు. అలాగే సేల్ డీడ్‌లు, వీలునామా, గిఫ్ట్‌డీడ్, పవర్ ఆఫ్ అటార్నీలు రిజిస్ట్రేషన్ చేసిన ప్రతి డాక్యుమెంట్‌కూ రూ.500 యూజర్ ఛార్జి విధిస్తారు.అంతేకాదు రూ.లక్ష లోపు విలువ ఉన్న ఆస్తికి స్టాంపులు ఇక నుంచి రూ.50కి పెంచారు. లక్ష దాటితే రూ.100 స్టాంపులను వినియోగించాలి. అలాగే వాణిజ్య సంస్థ, బైలా సొసైటీల రిజిస్ట్రేషన్ ధ్రువపత్రానికి రూ.100 యూజర్ ఛార్జీ వసూలు చేయనున్నారు. రిజిస్ట్రేషన్ చేయదలిచిన దస్తావేజులు పది దాటితే ఒక్కొక్క పేజీకి ప్రస్తుతం తీసుకునే రూ.5ను రూ.10గా పెంచారు. కార్డ్ (కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్) కింద అందించే సేవల్లో భాగంగా హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్ ఎక్విప్‌మెంట్, పవర్ బ్యాకప్, విద్యుత్తు బిల్లు, ఇతర అవసరాలకు ఖర్చులు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పెంపు వెంటనే అమల్లోకి వచ్చినట్లు తెలిపారు.మార్కెట్ విలువ ప్రకారం ధ్రువపత్రం జారీకి గతంలో రూ.10 ఉంటే ఇప్పుడు రూ.50కి పెరిగింది. ఈసీ సర్టిఫికేట్ యూజర్ ఛార్జీ గతంలో రూ.10. ఉంటే.. ఇప్పుడు రూ.100కు పెరిగింది. సర్టిఫైడ్ కాపీ గతంలో రూ.20 ఉంటే.. ఇప్పుడు రూ.100కు పెరిగింది. ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ఛార్జీ రూ.100 నుంచి రూ.200 వరకు ఉంటే ఇప్పుడు రూ.500కు పెరిగింది. రిజిస్ట్రేషన్ చేయదల్చిన పేజీలు పది దాటితే ఒక్కో పేజీకి గతంలో రూ.5 ఉంటే.. ఇప్పుడు రూ.10కి పెంచారు. రూ.5వేలలోపు స్టాంపులు కొనుగోలు చేస్తే గతంలో రూ.10 ఉంటే ఇప్పుడు రూ.50కు పెరిగింది. అలాగే రూ.5వేల కంటే స్టాంపులు కొనుగోలు చేస్తే రూ.20 ఉండేది.. ఇప్పుడు రూ.100 చేశారు. రూ.10వేల నుంచి 99,999 మధ్యన కొనుగోలు చేస్తే రూ.10 ఉండేది.. ఇప్పుడు రూ.50కు పెంచారు. రూ. లక్ష కంటే ఎక్కువగా కొనుగోలు చేస్తే రూ.20 ఉండేది.. ఇప్పుడు రూ.100కు పెంచారు. సర్టిఫైడ్ ఫర్మ రిజిస్ట్రేషన్ రూ.50 నుంచి రూ.100కు పెరిగింది. రిజిస్టర్డ్ సొసైటీ సర్టిఫైడ్ కాపీ రూ.50 నుంచి రూ.100కు పెరిగింది. ఈ పెంచిన ధరలు వెంటనే అమల్లోకి వచ్చాయని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్ శాఖ తెలిపింది.

# కేజ్రీవాల్ “ఇంటి” చుట్టూ రాజకీయాలు

**న్యూఢిల్లీ :**

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ “ఇంటి” చుట్టూ రాజకీయాలు మొదలయ్యాయి. ఇప్పటికే ఆప్ వర్సెస్ బీజేపీ వార్ గట్టిగానే జరుగుతోంది. ఇప్పుడు కేజ్రీవాల్ ఇంటి గురించి ఆ వాదం ఇంకాస్త ముదిరింది. ఇల్లు బాగు చేసుకునేందుకు కేజ్రీవాల్ రూ.45 కోట్లు ఖర్చు చేశారంటూ బీజేపీ ప్రచారం చేస్తోంది. కేజ్రీవాల్‌కి ఇన్ని విలాసాలెందుకు..? అని ప్రశ్నిస్తోంది. కోట్ల రూపాయల అవినీతికి పాల్పడి ఆ డబ్బుతోనే విలాసవంతమైన ఇళ్లు కట్టుకుంటున్నారని మండి పడుతోంది. దీనిపై ఆప్ కూడా గట్టిగానే బదులిస్తోంది. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం సీఎం కేజ్రీవాల్ నివసిస్తున్న ఇల్లు 80 ఏళ్ల క్రితం కట్టారని చెప్పారు. పైకప్పు పూర్తిగా పాడైపోయినందునే రెనోవేషన్ చేస్తున్నామని స్పష్టం చేశారు. “ప్రస్తుతం సీఎం కేజ్రీవాల్ నివసిస్తున్న ఇల్లు 80 ఏళ్ల క్రితం కట్టింది. సీఎం తల్లిదండ్రులు ఉంటున్న రూమ్ పై కప్పు కూలిపోయింది. సీఎం ఉండే రూమ్‌లోనూ పైకప్పు పెచ్చులూడుతోంది. అధికారులతో భేటీ అయ్యే రూమ్‌లోనూ ఇదే పరిస్థితి. అందుకే ఖచిత విభాగం ఇంటిని రెనోవేట్ చేసుకోవాలి సూచించింది. ఆ సూచనల ప్రకారమే బంగ్లాలో మార్పులు చేస్తున్నారు”బీజేపీ మాత్రం కేజ్రీవాల్ ఇంటి కోసం రూ.45 కోట్లు ఖర్చు చేస్తున్నారంటూ విమర్శలు చేస్తోంది. అయితే..ప్రస్తుతం అధికారికంగా అందిన సమాచారం ప్రకారం ఇంటీరియర్ డెకరేషన్ కోసం రూ. 11.30 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇక స్టోన్, మార్బుల్ ఫ్లోరింగ్ కోసం రూ.6 కోట్లు, ఇంటీరియర్ కన్సల్టెన్సీకి రూ.కోటి ఖర్చు చేయనున్నారు. ఎలక్ట్రికల్ ఫిట్టింగ్‌ల కోసం రూ.2.58కోట్లు, ఫైర్ ఫైటింగ్ సిస్టమ్ కోసం రూ.2.85 కోట్లు, వార్డ్‌రోబ్‌కి రూ.1.41 కోట్లు, కిచెన్ అప్లియనెన్స్ కి రూ.1.1కోట్లు ఖర్చు చేస్తున్నారని వెల్లడించారు అధికారులు. 2020 సెప్టెంబర్ 9వ తేదీ నుంచి 2022 జూన్ మధ్య కాలంలో ఈ ఖర్చులు చేసినట్టు స్పష్టం చేశారు. అయితే...బీజేపీ మాత్రం విమర్శలు ఆపడం లేదు. దీనిపై ఆప్ నేతలు ఓ సవాల్ విసిరారు. బీజేపీ వాళ్లే నేరుగా ఇంటికి వచ్చి చెక్ చేసుకోవాలని, నిజంగా అందుకు రూ.45 కోట్లు ఖర్చైందో లేదో డిబేట్ పెట్టాలని ఛాలెంజ్ చేశారు.

# కంటి వెలుగును గ్రామ ప్రజలందరూ వినియోగించుకోవాలి

**మంథని**



గ్రామ ప్రజల సౌకర్యార్థం సూరయ్యపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ భీమిని పుష్ప వెంకటస్వామి పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మాకముగా ప్రవేశ పెట్టిన కంటి వెలుగు కార్యక్రమమును మంథని మండలం సూరయ్యపల్లి గ్రామములోని రైతు వేదికలో గురువారం గ్రామ సర్పంచ్ భీముని పుష్ప వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుష్ప మాట్లాడుతూ ఈ రోజు నుండి మే నెల మూడు తారీకు వరకు కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామములో నిర్వహిస్తున్నామన్నారు ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను, మందులను పంపిణీ చేశారు. డాక్టర్ వందన పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ భీముని వెంకటస్వామి, వార్డ్ సభ్యులు గ్రామ ప్రజలు పాలుగోన్నారు.

## నెహ్రూ విగ్రహం తొలగింపు

**ఏలూరు**

భారత దేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ విగ్రహాన్ని తొలగించి పక్కన పెట్టడాన్ని జనసేన నాయకులు ఖండించారు. నూజివీడులో 1964లో జవహర్లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా విగ్రహం ఏర్పాటు చేసారు. తాజాగా మున్సిపల్ తీర్మానంతో విగ్రహాన్ని తొలగించడానికి ఖండించిని జనసేన నేతలు నిరసన దీక్షకు దిగారు. జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా స్వాతంత్ర సమరయోధులు,ప్రముఖ నేతల విగ్రహాన్ని ఎలా తొలగిస్తారు అంటూ జనసేన నాయకులు ధ్వజమెత్తారు.

## స్వరాష్ట్ర సాధన కోసం నాడు టీఆర్ఎస్.!

**హైదరాబాద్**

కేసీఆర్ సారథ్యంలో 22ఏళ్ల క్రితం పురుడు పోసుకున్న ఉద్యమ పార్టీ, స్వరాష్ట్ర గమ్యాన్ని ముద్దాడి నేటి బంగారు తెలంగాణకు బాటలు వేసిందని మంత్రి హరీష్ రావు అన్నారు. బీఆర్ఎస్ అవిర్భావ దినోత్సవం సందర్భంగా అయన ట్వీట్ ద్వారా శు భాకాంక్షలు తెలిపారు. అనతి కాలంలోనే ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన పార్టీగా నిలిచి, దేశానికే రోల్ మోడల్ అయ్యింది. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నాంది పలికింది. 9 ఏళ్లలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన కేసీఆర్, తెలంగాణ అభివృద్ధి మోడల్ ను దేశవ్యాప్తం చేసేందుకు బయలుదేరారు. దేశ అభివృద్ధి కోసం తెలపెట్టిన మహాయజ్ఞం జాతీయ స్థాయిలో విస్తరించి, మరిన్ని విజయాలు సాధించాలి. బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేశవిదేశాల్లోని ‘గులాబీ’ అభిమానులకు.. పార్టీ ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలని అయన అన్నారు.

## షేహజాదీపై దాడిని ఖండించిన బీజేపీ

**హైదరాబాద్**

జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు షెహజాదీపై దాడిని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి ఖండించారు. షెహజాదీపై దాడి చేసినోళ్లు ఎంఐఎం గూండాలే అని ఆరోపించారు. ముస్లిం మహిళలపై దాడులు చేస్తుంటే లౌకికవాద ముసుగులేసుకున్న పార్టీలు ఎందుకు స్పందించడం లేదు. మైనారిటీల అభివృద్ధి కోసం దేశమంతా తిరుగుతూ ముస్లిం ప్రజల్లో చైతన్యం తీసుకొస్తుంటే ఓర్వలేకే దాడులు చేస్తున్నారు. బీఆర్ఎస్, ఎంఐఎం నేతల తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదు. తక్షణమే షెహజాదీపై దాడి చేసిన నేతలను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షంచాలని అయన డిమాండ్ చేసారు.

## బీజేపీ ఎంపి ని అరెస్టు చేయాలి

**విశాఖపట్నం**

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బీజేపీ యం.పి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నరసింగ రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత ఐదు రోజుల నుండి రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి సంఫీ?భావంగా విశాఖ జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద విశాఖజిల్లా సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్.ఎఫ్.ఐ సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి.

ఈ కార్యక్రమంలో నరసింగరావు పాల్గొని మాట్లాడుతూ రెజ్లర్ల పై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ యం.పి పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఇంత వరకు ఆయనపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయకపోవడం దురదృష్టకరమన్నా రు. దేశానికి వన్నెతెచ్చిన క్రీడాకారుల పట్ల బిజెపి వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు తమపై అనైతిక చర్యలకు పాల్పడ్డాడని, తమను అగౌరవపరిచే విధంగా వ్యవహరిం చారని రెజ్లర్లు ఫిర్యాదు చేయాల్సిరా వడం చాలా ఆందోళకరమైన అంశం. క్రీడాకార్లుపై లైంగిక దాడి చేసిన అధికార పార్టీ ఎంపి, డబ్ల్యు.ఎఫ్.ఐ ఛీప్ మోడీ ప్రభుత్వం కాపాడుతోందని దుయ్యబట్టారు.

## మహేష్ మర్డర్ కేసులో ఐదుగురు అరెస్టు

**మంచిర్యాల**



రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన మంచిర్యాల జిల్లా ఇందారం గ్రామం లో మహేశ్ దారుణ హత్యా ఘటనలో ఐదుగురు నింది తులను జైపూర్ పోలీస్ లు అరెస్ట్ చేశారు, ఈ సందర్భంగా జైపూర్ ఏసిపి నరేందర్ మీడియా సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు, గతంలో మహేశ్, శృతి ఐదు5 సంవత్సరాలు గా ప్రేమించుకున్నప్పటికి ఆ తర్వాత మహేశ్ ప్రవర్తన నచ్చక శృతి దూరంగా ఉండడం జరిగింది. దాంతో మహేష్ వేధింపులకు గురి చేయడం తో పలు సార్లు మందలించడంతో పాటు కేసులు కూడ నమోదు అయ్యాయి. అయినా వేధింపులు కొనసాగుతుండడం తో కనకయ్య కుటుంబం పగ పెంచుకుంది. ఇదే హత్యకు దారి తీసినట్లు ఏసిపి నరేందర్ తెలిపారు. బండ రాయి, కత్తితో అందరూ చూడగానే పాశవికంగా హత్య చేసి పారి పోయారని అయన అన్నారు. మరో చోటికి ఈ రోజు పారి పోతుండగా వీరిని పట్టుకున్నట్లు తెలిపారు. కనకయ్య, పద్మ, సాయి, శ్రుతి , శ్వేతా లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులనుంచి కత్తి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

# టీడీపీ, బీజేపి పొత్తులపై చర్చోపచర్చలు

**విజయవాడ :**

ఏపీలో ఇప్పుడు రాజకీయ పొత్తులపై చర్చ జరుగుతోంది. ఓ ఇంగ్లిష్ టీవీ చానల్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు మోదీ విధానాలను సమర్థిస్తానని ప్రకటించారు. అయితే కలిసి పని చేస్తారా అన్న దానిపై కాలం నిర్ణయిస్తుందన్నారు. అంతే ఏపీలో మళ్లీ 2014 కూటమి ఖాయమన్న ప్రచారం ఊపందుకుంది. అయితే పొత్తుల వల్ల ఎవరికీ లాభం ఉండదని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. పొత్తుల వల్ల ఎవరికి ఎక్కువ లాభం అనే చర్చ ఇప్పుడు రాజకీయాల్లో జోరుగా సాగుతోంది. దేశం మొత్తం మీద బీజేపీ అత్యంత బలహీనంగా ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. నోటా కంటే తక్కువ ఓట్లు గత ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చాయి. ఆ పార్టీతో పొత్తు వల్ల టీడీపీకి ఓట్ల పరంగా కలసి వచ్చే అవకాశం లేదు. కానీ పొత్తు అంటే పెట్టుకుంటే.. టీడీపీ నష్టపోయే అవకాశాలు ఉన్నాయి. బీజేపీ పొత్తును వ్యతిరేకించే వర్గాలు ఆ పార్టీకి దూరమవుతాయి. అదే సమయంలో అర శాతం బీజేపీ ఓటర్లు కూడా టీడీపీ తో పొత్తు పెట్టుకున్నాం కదా అని టీడీపీకి ఓట్లు వేయరనే అంచనా ఉంది. టీడీపీని సంస్థాగతంగా వ్యతిరేకిస్తారు ఆ పార్టీ ఓటర్లు. అయితే జనసేన పార్టీతో మాత్రం పొత్తు కోరుకుంటున్నారు టీడీపీ నేతలు. ఆ పార్టీకి ఆరు శాతం వరకూ ఓటు బ్యాంక్ ఉంది. ఆ ఓట్లు గేమ్ ఛేంజర్ అని గట్టిగా నమ్ముతున్నారు. అందుకే ఆ పార్టీతో కలవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఏపీలో వచ్చే ఎన్నికలు ఫ్రీ అండ్ ఫెయిర్‌గా జరగవని టీడీపీ నేతలు గట్టిగా నమ్ముతున్నారు. వ్యవస్థల్ని అదుపులో పెట్టుకున్న జగన్మోహన్ రెడ్డి అరాచకాలకు పాల్పడతారని నమ్ముతున్నారు. అలాంటి పరిస్థితి రాకుండా ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలు జరగాలంటే కేంద్రం మద్దతు ఉండాలని భావిస్తున్నారు. బీజేపీ తమకు మద్దతుగా ఉండకపోయినా... వైసీపీకి సపోర్ట్ గా ఉండవద్దని కనీసం న్యూట్రల్ గా అయినా ఉండాలని చంద్రబాబు కోరుకుంటున్నారు. అందుకే తాము హితులమే అని చెప్పడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కలుస్తాయో లేదో కానీ టీడీపీ, బీజేపీ కలిసినప్పుడు మంచి ఫలితాలు వచ్చాయి. 2014లో బీజేపీతో కలిసి చంద్రబాబు పోటీ చేశారు. విజయం సాధించారు. 2019 ఎన్నికల నాటికి కాంగ్రెస్ తో కలిసి ఘోర పరాజయం పాలయ్యారు. అంతకు ముందు కూడా బీజేపీ, టీడీపీ కూటమిగా మారితే చాలా విజయాలు దక్కాయి. ఇటీవల అండమాన్‌లో మేయర్ పోస్టును పొత్తులో భాగంగా టీడీపీకి కేటాయించి బీజేపీ. అక్కడ టీడీపీకి ఉంది రెండే రెండు సీట్లు. అయినా మేయర్ సీటు ఇచ్చింది. బీజేపీ అధ్యక్షుడు నడ్డా ట్విట్టర్‌లో టీడీపీ, బీజేపీ కూటమికి శుభాకాంక్షలు అని ప్రకటించారు. నమ్మకమైన మిత్రపక్షాలు బీజేపీకి దూరమయ్యారు. బీజేపీ రెండు సార్లు పూర్తి మెజార్టీతో అధికారంలోకి రావడానికి కారణం ఉత్తరాది... హిందీ రాష్ట్రాలు. అక్కడ 95 శాతం సీట్లు సాధించడం ద్వారానే ఢిల్లీ పీఠం దక్కింది. రెండు సార్లు జరిగిన అద్భుతం మూడో సారి జరగకపోతే సీట్ల కోత పడుతుంది. దక్షిణాదిపై ఆ పార్టీకి ఆశలు లేవు. అందుకే ఇప్పుడు బీజేపీకి నమ్మకమైన మిత్రపక్షం కావాలి. వైసీపీ ఎలాగూ కూటమిలో చేరదు. టీడీపీకి కూటమిలో చేరే ఆప్షన్ ఉంది. ఎలా చూసినా రెండు పార్టీలు పొత్తులు పెట్టుకోవడం వల్ల ఇరువురికి వచ్చే లాభం అంటూ ప్రత్యేకంగా ఏమీ ఉండదని అంచనా వేయవచ్చు.

# ఉప్పల్ స్కై వాక్ -8 లిఫ్టులు, 6 స్టేర్ కేసులు, 4 ఎస్కలేటర్లు

**హైదరాబాద్ :**

ఉప్పల్ రింగురోడ్డు! హైదరాబాదీలకు అదొక బాదరబందీ! అటు నాగోల్ ఇటు సికింద్రాబాద్! ముందుకు వరంగల్, వెనక్కి రామాంతపూర్! అదొక ఎడతెగని పద్మవ్యూహం! ఎంత సిగ్నల్ ఫ్రీ చేసినా, పాదచారులకు ఆగమ్యగోచరం! వాళ్లని పట్టించుకునే నాథుడే లేడు! కాలువనిండా నీళ్లు ప్రవహించినట్టు, రోడ్డంతా వాహనాల ప్రవాహం! స్కూటర్ పట్టే సందులో ఆటో దూరుతుంటే, కాలినడకన వెళ్లేవడి పరిస్థితి ఏంటి? ఆడవారు, చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్డు దాటాలంటే నిత్య నరకం! వైతరణీ నదిని దాటినంత పనయ్యేది! ఇదీ నిన్నటి వరకు దుస్థితి! ఈ గజిబిజి గందరగోళానికి చరమగీతం పాడింది సర్కారు! అక్కడ సగటు పాదచారుడికి ఆకాశంలో నడిచే అదృష్టం కల్పించింది. ఉప్పల్ స్కై వాక్! మంత్రి కేటీఆర్ డ్రీమ్ ప్రాజెక్టుల్లో ఒకటి. దాదాపు రూ.25 కోట్ల వ్యయంతో నిర్మాణమైన ఉప్పల్ బోర్డ్ వాక్ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నది. 8 లిఫ్టులు, 6 స్టేర్ కేసులు, 4 ఎస్కలేటర్లతో వందేళ్లు మన్నేలా స్కైవాక్ నిర్మించారు. ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సెయిల్, విశాఖ స్టీల్ లతోపాటు జిందాల్ స్టీల్ వాడారు, జంట నగరాలు, శివారు ప్రాంతాల అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ త్వరలో ఇన్నర్ రింగ్ రోడ్డు ఉప్పల్ చౌరస్తా వద్ద పాదచారుల రక్షణ కోసం నలువైపుల రోడ్డు దాటేందుకు వీలుగా ఆకాశ వంతెనను ప్రజానీకానికి అందుబాటులోకి తీసుకురానుంది. సుమారు రూ.25 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఉప్పల్ స్కైవాక్ ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరుకున్నాయి. రాబోయే వంద సంవత్సరాలకు పైగా మనుగడలో ఉండే లక్ష్యంతో పాదచారుల వంతెన(ఉప్పల్ స్కైవాక్ ప్రాజెక్టు) రూపకల్పన జరిగింది. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో సుమారు వెయ్యి టన్నులకుపైగా స్ట్రక్చరల్ స్టీల్ వాడారు. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ తూర్పువైపు అభివృద్ధిని, పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని కొత్త ప్రాజెక్టులు చేపట్టాలని మూడేళ్ల క్రితం సూచించారు. అధికారులు రూపొందించిన అనేక నమూనాల నుంచి స్కై వాక్ డిజైన్‌ని ఎంపిక చేశారు. దాదాపు రూ.25 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను హెచ్ ఎండీఏకు అప్పగించారు. ఉప్పల్ చౌరస్తాలో రోడ్డు దాటే సమయంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడం, ఎక్కువ శాతం మహిళలు,స్కూల్ పిల్లలు గాయపడుతున్న అంశాలను దృష్టిలో పెట్టుకొని, అక్కడ పాదచారుల వంతెన నిర్మాణం శ్రేయస్కరమని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 37 పిల్లర్లు, 660 మీటర్ల పొడవు, మూడు(3), నాలుగు(4), అరు(6) మీటర్ల వెడల్పు కలిగిన ఉప్పల్ స్కైవాక్ భూమిపై నుంచి అరు(6) మీటర్ల ఎత్తులో ఉంటుంది. మొత్తం 660 మీటర్ల పొడవు కలిగిన ఉప్పల్ స్కైవాక్ సుందరీకరణ కోసం పైభాగంలో కేవలం 40 శాతం మేరకు రూఫ్ కవరింగ్ చేశారు. వాస్తవానికి 2020 ఏడాది చివర్లో ఉప్పల్ స్కైవాక్ ప్రాజెక్టు పనులు మొదలైనప్పటికీ వరుసగా రెండు సంవత్సరాల పాటు కోవిడ్ పరిస్థితుల కారణంగా ఆలస్యమైంది. ప్రాజెక్టులో 90 శాతం స్ట్రక్చరల్ స్టీల్ వాడకం ఉండడం, వెల్డింగ్ పనుల కోసం ఆక్సిజన్ సిలిండర్ల కొరత కారణంగా అనుకున్న టైంకి ప్రాజెక్టు కంప్లీట్ కాలేదు. ఉప్పల్ చౌరస్తాలో నలువైపులా ప్రతినిత్యం సుమారు 20 వేలమందికిపైగా పాదచారులు అటు ఇటు రోడ్ క్రాసింగ్ చేస్తారని అంచనా. ఉప్పల్ స్కై వాక్ అందుబాటులోకి రావడం ద్వారా కాలిబాటన రోడ్డు దాటే పాదచారులు స్కైవాక్ ను వినియోగించడం వల్ల ఉప్పల్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ ఫ్రీ గా వాహనాల రాకపోకలకు అవకాశం కలుగుతుంది. ఉప్పల్ మెట్రో రైలు స్టేషన్ ద్వారా ప్రతి రోజు సుమారు 25 వేల నుంచి 30 వేల మంది ప్రయాణికుల రద్దీ ఉంటుంది. వాళ్లంతా మెట్రో కాన్ కోర్ (ఫ్లోర్) నుంచి పాదచారుల వంతెన (స్కై వాక్) మీదుగా వారి వారి గమ్య స్థానాలవైపు వెళ్లేందుకు అవకాశం కలుగుతుంది. లిఫ్టులు, మెట్ల మార్గాల పరిసరాల్లో ఊఓఅం అర్బన్ ఫారెస్ట్ యంత్రాంగం పచ్చదనాన్ని (గ్రీనరీ) పెంచుతుంది.

# సచివాలయానికి తరలి వస్తున్న ఆఫీసులు

**హైదరాబాద్ :**

తెలంగాణలో కొత్త సచివాలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఏప్రిల్ 30వ తేదీన ఉదయం 6 గంటల తర్వాత సచివాలయంలో సుదర్శన యాగాన్ని ప్రారంభిస్తారు. యాగం పూర్తైన తర్వాత మధ్యాహ్నం1.20 నుంచి 1.30 మధ్య పూర్ణాహుతి చేస్తారు. ఆ వెంటనే కొత్త సెక్రటేరియెట్ భవనాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తారు. సచివాలాయాన్ని ప్రారంభించిన వెంటనే 6వ అంతస్తులోని తన చాంబర్లో సీఎం కేసీఆర్ కార్యకలాపాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం1.58 నుంచి 2.04 మధ్య మంత్రులు, ఆఫీసర్లు తమ చాంబర్లలో కొలువుదీరుతారు. సచివాలయ భవనం ప్రారంబమైన తొలి ఆరు నిమిషాల్లో ఒక ఫైల్ మీద సంతకం చేయాలని మంత్రులకు, అధికారులకు జీఏడీ సూచించింది. మధ్యాహ్నం 2.15కు సెక్రటేరియెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసే సమావేశంలో సీఎం కేసీఆర్ మాట్లాడతారు. మే ఒకటో తేదీన సెలవు కావడంతో, రెండో తేదీ నుంచి సీఎం, సీఎంఓ అధికారులు, మంత్రులు, సెక్షన్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు కొత్త సెక్రటేరియెట్ నుంచే పూర్తిస్థాయి విధులు నిర్వహించనున్నారు. కొత్త సచివాలయ భవనంలో ఒక్కో ఫ్లోర్?లో 3, 4 డిపార్ట్?మెంట్లు కొలువుదీరనున్నాయి. కొత్త సెక్రటేరియెట్?లో ఏ డిపార్ట్?మెంట్ ఏ ఫ్లోర్?లో ఉండాలనే దానిపై సాధారణ పరిపాలన శాఖ కసరత్తు పూర్తి చేసింది. ఈ నెల 27వ తేదీ నుంచి ఫైల్స్, కంప్యూటర్లు, జిరాక్స్ మెషీన్లను అయా శాఖల కార్యాలయాలకు తరలించనున్నారు. ఒక్కో ఫ్లోర్?లో మూడు, నాలుగు శాఖలకు గదులను కేటాయించారు. ఆరో అంతస్తులో సీఎం, సీఎంఓ, సీఎస్ కార్యాలయం ఉంటుంది. ఐదో ఫ్లోర్ లో జీఏడీ, ఆర్?అండ్?బీ, నాలుగో ఫ్లోర్?లో ఇరిగేషన్, లా, బీసీ వెల్ఫేర్, మూడో ఫ్లోర్?లో ఐటీ, మున్సిపల్, రెండో ఫ్లోర్?లో ఫైనాన్స్, ఫస్ట్ ఫ్లోర్?లో పంచాయతీరాజ్, గ్రౌండ్? ఫ్లోర్?లో రెవెన్యూ, ఎస్సీ డెవలప్?మెంట్ శాఖలకు గదులను కేటాయించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త సచివాలయ నిర్మాణానికి జూన్ 27, 2019న శంకుస్థాపన చేశారు. అత్యాధునిక హంగులతో కూడిన భవన సముదాయాన్ని పూర్తిచేసి, ప్రారంభానికి సిద్ధం చేశారు. ఇండో-పర్షియన్ నిర్మాణశైలిలో చారిత్రక కట్టడం తరహాలో భవనాన్ని డిజైన్ చేశారు. దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ షాపూర్‌జీ పల్లోంజీకి పనులు అప్పగించారు. డిజైన్లు పూర్తై, పనులు ప్రారంభమైన తర్వాత దాదాపు 26 నెలల్లోనే భవనాన్ని సిద్ధం చేశారు. రాష్ట్ర హైకోర్టు తరహాలోనే సచివాలయంపై డోమ్‌లు నిర్మించారు. రెండు డోమ్‌లపై నిర్మించిన జాతీయ చిహ్నాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మొత్తం 34 డోమ్‌లను ఏర్పాటు చేశారు. సచివాలయానికి ముందు, వెనుక భాగాల్లో ఏర్పాటు చేసిన డోమ్‌లు ఎత్తైనవి. సుమారు 165 అడుగుల ఎత్తున ఉన్న డోమ్‌పై జాతీయ చిహ్నాలను ఏర్పాటు చేయడంతో సుదూర ప్రాంతంనుంచి కూడా ఇవి కనిపిస్తాయి. సచివాలయంలో నీటి సరఫరా కోసం హైడ్రో న్యూమాటిక్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఓవర్ హెడ్ ట్యాంక్‌ను అత్యవసర సమయాల్లో మాత్రమే ఉపయోగించేలా తగిన ఏర్పాట్లు చేశారు. వర్షపునీటిని స్టోర్ చేసేందుకు సంపును ఏర్పాటు చేశారు. భవనంపై పడిన నీటిచుక్కకూడా వృథాకాకుండా అవి సంపులోకి చేరేలా చేసి జలసంరక్షణ ప్రాధాన్యత ఇచ్చారు. కొత్త సచివాలయాన్ని గ్రీన్ కాన్సెప్ట్ విధానంలో నిర్మించారు. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే విధంగా డిజైన్ చేశారు. భవనం చుట్టూ గదులు, మధ్యలో ఖాళీ స్థలం ఉంచారు. అన్నివైపుల నుంచి వెంటిలేషన్ వచ్చేలా ఏర్పాటు చేశారు. మొత్తం ఎనిమిది ఎకరాల స్థలాన్ని పచ్చదనం కోసం కేటాయించారు. పచ్చికతోపాటు మొక్కలను కూడా నాటారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో గ్రంథాలయాన్ని నిర్మిస్తున్నారు. తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌వైపు 2,500 చదరపు అడుగుల విస్తీర్ణం లో క్యాంటీన్, అదే వరుసలో గుడి, బ్యాంకు, ఏటీఎం ఉంటా యి. సచివాలయ ప్రాంగణంలో రెం డున్నర ఎకరాల్లో 560 కార్లు, 720 ద్విచక్ర వాహనాలు, నాలుగు బస్సులకు పార్కింగ్ సౌకర్యం కల్పించారు. సందర్శకులకోసం మరో 300 కార్లు పట్టేలా ఒకటిన్నర ఎకరాల్లో పార్కింగ్‌ను ఏర్పాటుచేశారు. రోజువారీ సందర్శకులు, అధికారులు, ప్రత్యేక సమావేశాల సందర్భంలో వచ్చే వాహనాలను దృష్టిలో ఉంచి ఏర్పాట్లు చేవారు. సచివాలయంలోని ఆరో అంతస్థులో సీఎం, చీఫ్ సెక్రటరీల చాంబర్లను ఏర్పాటు చేశారు. వీటితోపాటు సీఎం సిబ్బంది, ముఖ్యమంత్రి ప్రజలను కలిసేందుకు 'జనహిత' పేరుతో 250 మంది కూర్చునేవిధంగా సమావేశ మందిరం, మంత్రులు, అధికారులకు సరిపడా క్యాబినెట్ సమావేశం కోసం మరో హాలు, సీఎంను కలిసేందుకు వచ్చేవారికోసం ప్రత్యేక వెయిటింగ్ హాలును నిర్మించారు. కలెక్టర్లతో సమావేశాల నిర్వహణకు కూడా ప్రత్యేక సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారు. కనీసం 25 మంది విశిష్ట అతిథులతో ముఖ్యమంత్రి కలిసి భోజనం చేసేందుకు ఓ అత్యాధునిక డైనింగ్ హాలును కూడా ఆరో అంతస్తులో ఉంది. నూతన సచివాలయం ఈ నెల 30న సీఎం కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభం కానున్న నేపథ్యంలో కార్యాలయాల తరలింపు చేయనున్నారు. 30వ తేదీ నుంచి కొత్త సచివాలయంలో పాలన సాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని శాఖలు తమకు కేటాయించిన గదులకు సామగ్రిని బుధవారం నుంచి శుక్రవారం వరకు తరలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. షిఫ్టింగ్ చేయాల్సిన సమయాన్ని కూడా అధికారులు నిర్ధారించారు. ఒక్కో అంతస్తులో మూడు శాఖల కార్యాలయాలు ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఫైళ్లు, కంప్యూటర్లు, జిరాక్స్ మిషన్లు తదితర వాటిని జాగ్రత్తగా తరలించాలని, ముఖ్యమైన ఫైళ్ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఫైళ్లకు ఆయా శాఖల ఉద్యోగులు, అధికారులదే పూర్తి బాధ్యతని స్పష్టంచేశారు.

# తెలుగు సీఎంలకు మహారాష్ట్ర ఫాలోయింగ్

**ముంబై :**

తెలుగు రాష్ట్రాల సీఎంలకు మహారాష్ట్రలో ఎక్కువ ఫాలోయింగ్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. కేసీఆర్ ప్రారంభించిన భారత రాష్ట్ర సమితిలో చేరేందుకు ప్రతీ వారం తెలంగాణ భవన్‌కు నేతలు వస్తున్నారు. ఇప్పటికి మహారాష్ట్రలో మూడు బహిరంగసభలు పెట్టి చాలా మందిని బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. అదే సమయంలో ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రధాని కావాలంటూ మహారాష్ట్ర నుంచే డిమాండ్ వినిపిస్తోంది. అందు కోసం సైకిల్ యాత్రలు చేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలకు ఈ క్రేజ ఉండటం సహజంగానే అందర్నీ ఆశ్చర్య పరుస్తుంది. ఏపీ సీఎం జగన్ పై అభిమానం రాష్ట్రాల సరిహద్దులు దాటింది. ఓ మహారాష్ట్ర రైతు సీఎం జగన్ పై అభిమానంతో మహారాష్ట్ర నుంచి సైకిల్ యాత్రగా వచ్చాడు. ఆ రైతు పేరు కాకా సాహెబ్ లక్ష్మణ్ కాక్డే. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాకు చెందినవాడు. ఏపీ ముఖ్యమంత్రి జగన్ అన్నా, ఆయన విధానాలు అన్నా లక్ష్మణ్ కాక్డే ఎంతో అభిమానించేవాడు. దాంతో జగన్ ను ఎలాగైనా కలవాలని నిశ్చయించుకున్నాడు. రై ఈ నెల 17న మహారాష్ట్రలోని తన స్వస్థలం నుంచి ఓ సైకిల్ పై బయల్దేరాడు. 800 కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ వచ్చి తాడేపల్లి చేరుకున్నాడు. రైతు కాక్డే జగన్ బొమ్మ ఉన్న టీషర్టును ధరించివచ్చారు. దానిపై కాబోయే ప్రధాని జగన్ అని రాసివుంది. జగన్ ప్రధాని అయితేనే దేశ ప్రజల సమస్యలు తీరుతాయని ఆయన నమ్మకం. సీఎం జగన్ కాక్డేను పిలిచి ఆప్యాయంగా మాట్లాడారు. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో కూడా పంచుకున్నారు. మరో వైపు మహారాష్ట్ర నుంచి భారత రాష్ట్ర సమితిలోకి చేరికలు ఉంటున్నాయి. మరే ఇతర రాష్ట్రం నుంచి వచ్చి చేరేవారు లేరు కానీ మహారాష్ట్ర నుంచి మాత్రం వారానికోసారి నేతలు వస్తున్నారు. చేరికల పరంపర కొనసాగుతూనే ఉన్నది. మహారాష్ట్ర చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాలకు చెందిన, పలు రంగాల నేతలు, విద్యాధికు లు, నిపుణులు బుధవారం తెలంగాణ భవన్లో గులాబీ కండువా కప్పుకొని బీఆర్ఎస్ చేరారు. ఒక్క మహారాష్ట్ర నుంచే ఎందుకు వస్తున్నారు.. ఇతర రాష్ట్రాల నుంచి ఎందుకు రావడం లేదన్న విషయం పక్కన పెడితే.. మహారాష్ట్రలో బీఆర్ఎస్‌కు మంచి ఆదరణ ఉందని ఆ పార్టీ నేతలు నమ్ముతున్నారు. కేసీఆర్ దేశ ప్రధాని కావాలని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని వారి తరపున బీఆర్ఎస్ నేతలు రోజూ ప్రకటిస్తూనే ఉంటారు. కేసీఆర్ ప్రధాని కావాలనుకుంటున్నారని అలా నేరుగానే చెబుతారు. ఇప్పుడు ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి కూడా ప్రధాని పదవిపై ఆశలు పెట్టుకున్నట్లుగా కనిపిస్తున్నారని తాజా పరిణామాలు చూస్తున్నవారు అంటున్నారు. సీఎం జగన్ ప్రధాని కావాలనే స్లోగన్‌తో టీ షర్టు తో మహారాష్ట్ర వ్యక్తి వచ్చిన విషయాన్ని వైసీపీ సోషల్ మీడియా మొత్తం ఆ విషయాన్ని ట్రెండ్ చేసే ప్రయత్నం చేసింది. దీంతో ప్రధాని పదవిపై జగన్ ఆశపడ్డారని.. స్ట్రాటజీలు ప్రారంభించేశారని అంటున్నారు. ఇప్పటికే వైసీపీ నేతలు అనేక మంది జగన్ ప్రధానమంత్రి అవుతారని ప్రకటించారు. ప్రకటిస్తూనే ఉన్నారు. స్వయంగా మంత్రులు ఇలాంటి ప్రకటనలు చేసే వారిలో ఉన్నారు. వారంతా జగన్ ను మెప్పించేందుకు .. ఆయన మనసులో ఉన్న కోరికను ఇలా బహిరంగంగా చెబుతున్నారు. ఎలా చూసినా జగన్ కూడా ప్రధాని పదవిపై గట్టిగానే ఆశలు పెట్టుకుంటున్నారు.

# దూకుడు పెంచిన టీటీడీపీ

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఎన్నికలకు మరో ఆరు నెలలు మాత్రమే సమయం ఉండటంతో.. టీటీడీపీ దూకుడు పెంచుతోంది. టీడీపీ అధినేత చంద్రబాబు ఏపీతో పాటు తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. టీటీడీపీ నేతలకు టచ్‌లో ఉండటంతో పాటు పార్టీ కార్యక్రమాలను షురూ చేయాలని నేతలకు సూచనలు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి టీడీపీ కార్యక్రమానికి టీటీడీపీ శ్రీకారం చుట్టగా.. ఈ కార్యక్రమంలో భాగంగా టీటీడీపీ నేతలు గడపగడపకు వెళుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ హయాంలో చోటుచేసుకున్న అభివృద్ధి గురించి తెలియజేస్తున్నారు.

ఈ క్రమంలో పార్టీ బలోపేతం కోసం టీటీడీపీ మరో భారీ ప్లాన్ వేసింది. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల సందర్బంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సభలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసుకుంది. అందులో భాగంగా ఈ నెల 29వ తేదీ నుంచి మే 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో సభలను టీటీడీపీ నిర్వహించనుంది. తెలంగాణలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల పేరుతో సభలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను టీటీడీపీ తాజాగా ప్రకటించింది. ఈ నెల 29న జహీరాబాద్, మే3న మహబూబ్‌నగర్, 4న భువనగిరి, 6న హైదరాబాద్, 7న ఖమ్మం, 8న మహబూబాబాద్, 9న సికింద్రాబాద్, 10న మెదక్, 11న ఆదిలాబాద్, 12న కరీంనగర్, 12న నాగర్ కర్నూల్, 14న పెద్దపల్లి, 15న చేవెళ్ల, 16వ తేదీన వరంగల్, 17న నిజామాబాద్, 19న మల్కాజ్ గిరి, 20వ తేదీన నల్లగొండ పార్లమెంట్ పరిధిలో సభలు నిర్వహించనున్నారు. ఈ సభలలో పార్టీ కార్యకర్తలు, అభిమానులందరూ పాల్గొని విజయవంతం చేయాలని టీటీడీపీ పిలుపునిచ్చింది. అయితే ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏడాది టీడీపీ మినీ మహానాడు సభలు నిర్వహిస్తూ ఉంటుంది. అయితే ఈ సారి ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల పేరుతో ప్రత్యేక సభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఎక్కడ నిర్వహించాలనే దానిపై వేదికలను కూడా సిద్ధం చేయనున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో బాన్సువాడ నియోజకవర్గంలోని వర్నిలో, మహబూబ్ నగర్ టౌన్, మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్, హైదరాబాద్ లోని కార్వాన్, ఖమ్మం టౌన్, ములుగు, ఖైరతాబాద్, నరసాపూర్, ఉట్నూరు, కరీంనగర్, కొల్లాపూర్, చెన్నూర్ నియోజకవర్గంలోని మందమర్రి టౌన్, చేవేళ్లలోని పరిగి టౌన్, వరంగల్, నిజామాబాద్ పరిధిలోని ఆర్మూరు టౌన్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి, నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ టౌన్‌లో సభలు నిర్వహించనున్నారు.

# బీజేపీ తో ప్రజాస్వామ్యానికి ప్రమాదం..!

**కమాన్ పూర్**



బీ. జే. పీ తో ప్రజాస్వామ్యానికి ప్రమాదం పొంచివుందని, ప్రజాశ్వామ్యాన్ని పరిరక్షించు కోవాలంటే బీ. జే. పీ ని గద్దెదించాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి అన్నారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా ప్రజను ఉద్దేశిస్తూ మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు విఫరీతంగా పెరిపోతున్నాయని, సామాన్య ప్రజలపై పెనుభారం పడుతుం దాన్నారు. విభజన హామీలు అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్రం పై కేంద్ర ప్రభుత్వం కక్ష పూరీతంగా వ్యవహారిస్తుం దాన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతుందన్నారు. ప్రాణాహిత - చేవెళ్లకు, కాళేశ్వరం ప్రాజెక్టు కు జాతీయ హోదా ప్రకటించడం లేదన్నారు. 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 2 లక్షల ఉద్యోగాలు కూడ ఇవ్వలేదన్నారు. 72 లక్షల కోట్ల నల్ల ధనాన్ని తీసుకవచ్చి పేద కుటుంబాలకు రూ,15 లక్షలు ఖాతాల్లో వేస్తామని చెప్పి నేటికీ నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ రంగా సంస్థలను ప్రయివేట్ ఫరం చేస్తూ..దేశాన్ని అంబాని, ఆదానిలకు దారదత్తం చేస్తున్నాడాన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, సురేష్, మణికంత రెడ్డి, మంథని ఇన్చార్జి గౌతమ్ గోవర్ధన్, కమాన్పూర్ మండల కార్యదర్శి కందుకూరు రాజరత్నం, పెద్దపెల్లి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎల్ ప్రకాష్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, లక్ష్మ తదితరులు పాల్గొన్నారు

ప్రజా తపన
prajathapana.com

## అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై ఈసీ ఫోకస్

**హైదరాబాద్**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై సీఈవో సమీక్షించారు. అన్ని జిల్లాల ఈసీలతో సీఈవో వికాస్ రాజ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి వారం పార్టీల ప్రతినిధులతో భేటీలు నిర్వహించి క్లైమ్?లు, అభ్యంతరాలను తెలియచేయాలని సీఈవో ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్ర, జిల్లా స్థాయి మాస్టర్ లెవల్ ట్రైనర్లను గుర్తించాలని సూచించారు. ఓటరు అవగాహన కార్యక్రమాలను సైతం చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఈవీఎంల పనితీరును జూన్ 1 నుంచి పరిశీలిస్తామని సీఈవో ప్రకటించారు. ఎలక్టోరల్ రోల్‌ను ఏప్రిల్ 30 వరకు పూర్తి చేసి ప్రచురించాలని ఆదేశించారు వికాస్ రాజ్. ఓ వైపు రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధం అవుతుండగా.. నిర్వహణకు ఈసీ కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో ఎలక్షన్ హీట్ మొదలైంది.

## కోడెల ఆత్మహత్యకు ఆయనే కారణం

**గుంటూరు**



ఏపీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు చావుకు ప్రధాన కారణం చంద్రబాబే అని మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. సత్తెనపల్లిలో చంద్రబాబు చేసిన రోడ్ షో అట్టర్ ప్లాఫ్ అని అన్నారు. సత్తెనపల్లిలో చంద్రబాబు కార్యక్రమానికి జనాలు ఎవరూ రాలేదని, రాకపోయినా వచ్చారని చెప్తూ మహా అద్భుతం అంటున్నారని ఎద్దేవా చేశారు. నిజం చెప్తే చంద్రబాబు తల వెయ్యి ముక్కలయ్యేలా శాపం ఉందని, అందులో భాగంగానే సత్తెనపల్లిలో కూడా చంద్రబాబు ఒక్క నిజం కూడా మాట్లాడలేదని ఎగతాళి చేశారు. మంత్రి అంటి రాంబాబు గురువారం మీడియాతో మాట్లాడారు." నీ కన్నా, నీ కొడుకు కన్నా, కొడెల శివప్రసాద్ కన్నా.. వంద రెట్లు నీతి మంతుణ్ని నేను. తెలుగు దేశం నాయకులకు కూడా అన్యాయం జరగకూడదని భావించే మంచి వ్యక్తిని నేను. నన్ను ఆంబోతు అంటారా? చంద్రబాబు ఎక్కడ పుట్టారు.. ఎక్కడ పెరిగారు. ఆయన జీవితం అంతా ఆంబోతులకు ఆవులు సప్లై చేయడమే సరిపోయింది. "చంద్రబాబు పదే పదే సైకో పోవాలి, సైకిల్ రావాలని అంటున్నారని, చంద్రబాబే ఒక రాజకీయ సైకో అంటూ సీరియస్ అయ్యారు. అధికారం లేకపోతే చంద్రబాబు బతకలేడని వ్యాఖ్యానించారు. రెక్కల కష్టంలో పార్టీని ఒంటి చేత్తో నిలబెట్టిన జగన్ సీఎంగా అనర్హుడా? అని ప్రశ్నించారు. మరి చంద్రబాబు, నారా లోకేష్ మాత్రమే అర్హులా? అని అడిగారు. ఈ 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు అసలు పేదలకు మంచి చేశారా అని నిలదీశారు. సీఎం జగన్ పేద ప్రజలకు రెండు లక్షల కోట్ల డబ్బులను వారి ఖాతాల్లో వేసి ధనవంతులుగా చేసే ప్రయత్నం చేశారని అన్నారు. కోడెల శివప్రసాదరావు ఉరి వేసుకోవడానికి ప్రధాన కారణం చంద్రబాబే అని అన్నారు. కోడెల కుటుంబానికి ద్రోహం చేసిన వ్యక్తి చంద్రబాబు అని ఆరోపించారు. ముమ్మాటికీ తన రాజకీయ ప్రత్యర్థి కోడెల శివప్రసాదరావు అని అంబటి రాంబాబు అన్నారు.పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ.. చంద్రబాబు తప్పిదం వల్లే పోలవరం ప్రాజెక్టు ఆలస్యం అవుతోందని అన్నారు. కాఫర్ డ్యాం కట్టకుండా డయాఫ్రం వాల్ కట్టారని, దాంతో అది కొట్టుకుపోయిందని అన్నారు. చంద్రబాబు తప్పిదం వల్లే రూ.2 వేల కోట్ల నష్టం జరిగిందని అంబటి రాంబాబు ఆరోపించారు.

## ఎంసెట్-2023కు.. 3.20 లక్షల మంది విద్యార్థులు

**హైదరాబాద్**

తెలంగాణ ఎంసెట్-2023కు ఈసారి భారీసంఖ్యలో దరఖాస్తులు అందాయి. దాదాపు 3.20 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంజినీరింగ్‌కు 2,05,075, అగ్రికల్చర్‌కు 1,15,189 మంది దరఖాస్తు చేశారు. ఇక ఏపీ నుంచి ఈసారి ఇంజినీరింగ్‌కు 51,427, అగ్రికల్చర్‌కు 20,731 మంది పోటీపడుతున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి 20కి పైగా పరీక్షా కేంద్రాలు పెరగనున్నాయి. ఈమేరకు పరీక్షా కేంద్రాల సంఖ్యను పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతేడాది తెలంగాణలో 89, ఏపీలో 19 మొత్తం 108 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈసారి పరీక్ష కేంద్రాల సంఖ్యను 130 వరకు పెంచే అవకాశం ఉంది. దీనిపై ఎంసెట్ కో కన్వీనర్ ఆచార్య విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి, టీసీఎస్ ప్రతినిధులతో చర్చించి ఒకటి రెండు రోజుల్లో పరీక్షా కేంద్రాల సంఖ్యను ఖరారు చేస్తామన్నారు.ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఈసారి అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పాత పరీక్షాకేంద్రాలతోపాటు కొత్తగా ఏర్పాటుచేస్తున్న వాటిలో కంప్యూటర్లన్నీ సవ్యంగా పనిచేస్తున్నాయో.. లేదో తెలుసుకుని వాటిని పరీక్షించామని టీసీఎస్ అయాన్ డిజిటల్ ప్రతినిధుల నుంచి హామీపత్రాన్ని తీసుకోవాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. స్క్వాడ్లు సైతం మొబైల్ ఫోన్లు పరీక్షాకేంద్రంలోకి తీసుకెళ్లకుండా ఈసారి కొత్త నిబంధన విధించనున్నారు. కాగా తెలంగాణ ఎంసెట్- 2023 పరీక్షలు మే 10 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న విషయం తెలిసిందే. ఆయా కేంద్రాలున్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయాలు లేకుండా చూడాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

# రసవత్తరంగా మారిన కాకినాడ రాజకీయం

**కాకినాడ :**

కాకినాడ పార్లమెంటు నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా మారింది. ముఖ్యంగా టీడీపీ నుంచి సీటు ఎవరిని వరిస్తుందోననే సస్పెన్స్ నెలకొంది. ఆశావహులు పెరుగుతుండడంతో టీడీపీ టికెట్ కు డిమాండ్ ఏర్పడింది. తాజాగా కాకినాడ టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ రంగంలోకి దిగారు. మొన్న అన్నవరం సత్యనారాయణ స్వామి సన్నిధిలో పూజలు జరుపుకొని అనంతరం జిల్లా పెద్దలను కలిసే పనిలో పడ్డారు. తన అభ్యర్థిత్వాన్ని సహకరించాలని ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ పెద్దలు, సీనియర్ కార్యకర్తల ఆశీస్సులు తీసుకుంటున్నారు. ప్రతి గ్రామంలోనూ నవీన్ కు విశేష ఆదరణ దక్కుతోంది. దీంతో కాకినాడ పార్లమెంటులో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఎన్నికల ప్రచారం తలపించే రీతిలో గ్రామగ్రామాన పచ్చ జెండాలు రెపరెపలాడుతున్నాయి. దీంతో వైసీపీలో గుబులు రేగుతోంది.రాజకీయ నేపథ్యం గల కుటుంబం నుంచి వచ్చిన జ్యోతుల నవీన్ కుమార్ కాకినాడ జిల్లాలో మంచి ఫాలోయింగ్ ఉందనే చెప్పాలి. జిల్లాలో ఉన్న ఏడు నియోజకవర్గాల్లో నవీన్ కు బంధు వర్గం ఉంది. కాపు సామాజిక వర్గంలోనూ బంధువులు ఉండటంతో పాటు మిగిలిన సామాజిక వర్గాల్లో మిత్రులు కూడా ఉన్నారు. నవీన్ తండ్రి జ్యోతుల నెహ్రూ సీనియర్ రాజకీయ వేత్త కావడం, దీనికి తోడు అతను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంచి సంబంధాలు కలిగి ఉండటం ఆయనకు కలిసొచ్చే అంశంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. గతంలో నవీన్ జగ్గంపేట నియోజక వర్గంలో పాదయాత్ర చేసి జనంలో ముద్ర వేసుకొన్నారు. తాజాగా అభ్యర్థిత్వం కోసం ప్రతి సీనియర్ కార్యకర్త, పార్టీ నాయకులు ఇంటికి వెళ్లి సహకరిం చాలని కోరుతు న్నారు. ఇందులో భాగంగా ఏడు నియోజక వర్గాల్లోనూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. నవీన్ ఇటీవలే పార్టీ యువనేత నారా లోకేష్ ను కలిసి కొన్ని రోజులపాటు యువగళం పాదయాత్రలో పాల్గొన్నారు .అధికార వైసీపీలో పార్టీలో గందరగోళం నెలకొంది. వాస్తవానికి ఇక్కడ సిట్టింగ్ ఎంపీ వంగా గీత ఉన్నా, పిఠాపురం అసెంబ్లీ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు గతంలో ప్రచారం జరిగింది. అయితే అక్కడి సీటు సిట్టింగ్ శాసన సభ్యుడు పెండెం దొరబాబుకు ప్రకటించారు. దీంతో గీతకు పిఠాపురం నో చాన్స్ అని చెప్పాలి. అయితే గీత మళ్లీ కాకినాడ పార్లమెంటు సీటునకు పోటీ చేస్తారా లేక ఏదైనా అసెంబ్లీకి పోటీ చేస్తారా అనేది స్పష్టత లేదు. అయితే ఈ సారి కాకినాడ పార్లమెంటుకు రూరల్ శాసన సభ్యుడు కన్నబాబు పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ కాకినాడ పార్లమెంటు అభ్యర్థిత్వం పట్ల గందరగోళంలో నెలకొంది. అయితే భవిష్యత్తు పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

# ప్రధాని రేసులో ప్రియాంక

**న్యూఢిల్లీ:**

రాహుల్ గాంధీ తర్వాత ప్రియాంక గాంధీకి పార్టీ కమాండ్ ఇవ్వాలని.. ఆ పార్టీలోని ఒక వర్గం చాలా కాలంగా కోరుతోంది. అటు పార్టీలో.. ఇటు బయటా.. ప్రియాంక గాంధీ కోసం బహిరంగంగా వాదిస్తున్న నాయకుడు ప్రమోద్ కృష్ణం. తాజాగా.. ఆయన తెరపైకి కొత్త డిమాండ్ తీసుకొచ్చారు. ప్రియాంక గాంధీ ని ప్రతిపక్షాల ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో కొత్త చర్చ మొదలైంది.రాయ్‌పూర్ కాంగ్రెస్ సమావేశంలో సోనియా గాంధీ రిటైర్మెంట్‌ను ప్రకటించారు. పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష ఖరారు అయిన తర్వాత.. రాహుల్ గాంధీ లోక్ సభ సభ్యత్వం రద్దు అయ్యింది. దీంతో ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాహుల్‌కు ఛాన్స్ లేదు. దీనిపై రాహుల్ హైకోర్టులో సవాల్ చేసినా.. ఇప్పటివరకు ఎలాంటి ఉపశమనం లభించలేదు. ఒకవేళ కోర్టుల నుంచి ఉపశమనం లభించకపోతే.. ప్రియాంక గాంధీ ప్రధాన పాత్ర పోషిస్తారా అనే చర్చ జరుగుతోంది.ఇటు రాయ్‌బరేలీ నుంచి



సోనియా గాంధీ స్థానంలో అయినా.. లేకపోతే.. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి అయినా ప్రియాంక గాంధీ పోటీ చేస్తారనే టాక్ వినిపిస్తోంది. ప్రియాంక గాంధీ 2019లో కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. అంతకు ముందు కూడా.. ఆమె కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించారు.గత లోక్‌సభ ఎన్నికల తర్వాత.. రాహుల్ గాంధీ రాజీనామా చేయడంతో.. ప్రియాంక గాంధీకి అవకాశం వచ్చిన ట్లుంది. కానీ.. ఏం జరిగిందో తెలియదు.. ఇటీవల ఖర్గే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయ్యారు. అయినా.. ప్రియాంక మునుపటి లాగానే కాంగ్రెస్ వ్యూహ రచనలో, వివాదాలను పరిష్కరించడంలో తెర వెనుక చురుగ్గా వ్యవహరిస్తున్నారు .రాహుల్ గాంధీ చిక్కుల్లో పడిన తర్వాత.. ప్రియాంక గాంధీకి పెద్దపీట వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే.. ప్రస్తుతం ప్రియాంక గాంధీకి సంబంధించిన చర్చ అనవసరమని కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ వ్యాఖ్యానించారు. ప్రియాంక గాంధీకి పార్టీలో ముఖ్యమైన పాత్ర ఉందని.. రాహుల్ గాంధీ అత్యున్నత నాయకుడని.. మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్ అధ్యక్షుడని స్పష్టం చేశారు.ప్రియాంక గాంధీ ప్రస్తుతం కర్ణాటకలో పార్టీ తరపున ప్రచారం చేస్తున్నారు. కొన్ని నెలల కిందట హిమాచల్ ప్రదేశ్‌లో ప్రచార బాధ్యతలు భుజాన ఎత్తుకున్నారు. ట్రబుల్ షూటర్‌గా.. స్టార్ క్యాంపెయినర్‌గా ప్రియాంక గాంధీ సక్సెస్ అయ్యారనే టాక్ ఉంది. ఈ నేపథ్యంలో.. ప్రియాంకను కాంగ్రెస్ ఎలా ఉపయోగించుకుంటుందో చూడాలి. ప్రస్తుతం అయితే.. తన సోదరుడు రాహుల్ కనుసన్నల్లోనే నడవక తప్పదని తెలుస్తోంది. 2024లో కూడా రాహుల్ విఫలమైతే.. ప్రియాంక గాంధీ పార్టీ సారథ్యం వహించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

**హైదరాబాద్**

హైదరాబాద్ రవీంద్రభారతిలో భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ బీసీ సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని అన్నారు. ప్రభుత్వం బీసీ వర్గా సంక్షేమానికి కట్టుబడి వుందని. రాష్ట్రంలో 3100 బీసీ గురుకులాలను ప్రపంచస్థాయిలో నిర్వహిస్తున్నామని అన్నారు. బీసీ ల ఆత్మ గౌరవం కోసం వేల కోట్ల తో కోకాపేట, ఉప్పల్ భగాయత్ లాంటి ప్రాంతాల్లో 41 కుల సంఘాలకు మొత్తం 87.3 ఏకరాలలలో 95 ఆత్మ గౌరవ భవనాలు కడుతున్నామని అన్నారు. భగీరథ మహర్షి వారసులనయి సగరులక సైతం కోకాపేట్ లో రెండు ఎకరాల స్థానం కేటాయించాం. రెండు కోట్ల నిధులతో ఆత్మ గౌరవ భవనం కడుతున్నామని అన్నారు. ఆనాడు దివినుంచి భువికి గంగను దింపిన భగీరథ మహర్షి లాగే ఈ రోజు సీఎం కేసీఆర్ పైన పారుతున్న గోదావరి నదిని కాళేశ్వరంలో ఉరకలెక్కించి తెలంగాణలోని పలు ప్రాంతాలకు నీరు అందిస్తున్నారని అన్నారు. తెలంగాణలో ప్రతి ఇంటికి పైపుల ద్వారా తాగు నీటీ సరఫరా కార్యక్రమానికి మిషన్ భగీరథ పేరు పెట్టామని గుర్తు చేసారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, సగర సంఘం అధ్యక్షుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కొడనాడు ఎస్టేట్ మిస్టరీ తేల్చే పనిలో సీబీసీఐడీ..

## వాచ్ మన్ హత్య.. దోపిడీకి సంబంధించిన మిస్టరీ లెక్క-చిన్నమ్మకు కొత్త చిక్కులు

**చెన్నయ్ :**

అమ్మ జయలలిత అనూహ్య మరణంతో చోటు చేసుకున్న పరిణామాలు అన్ని ఇన్ని కావు. తమిళనాడు రాజకీయ ముఖచిత్రం సిత్రవిచిత్రంగా మారిపోవటటంలో అమ్మ మరణం కీలకమని చెప్పాలి. ఇదిలా ఉంటే.. జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్ లో 2017 నవంబరులో జరిగిన వాచ్ మన్ హత్య.. దోపిడీకి సంబంధించిన మిస్టరీ లెక్క తేల్చేందుకు సీబీసీఐడీ రంగంలోకి దిగింది.ఈ వ్యవహారాన్ని అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. మమా అన్నట్లుగా పూర్తి చేశారు. ఇదిలా ఉంటే.. ఈ విషయాన్ని స్టాలిన్ సర్కారు మాత్రం సీరియస్ గా తీసుకున్నట్లుగా కనిపిస్తోంది.ఇందులో భాగంగా అమ్మకు ఆప్తురాలు శశికళతో పాటు.. ఒక జ్యోతిష్యుడిని కూడా విచారించేందుకు వీలుగా నోటీసులు ఇవ్వాలన్న ఆలోచనలో పోలీసులు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి.. ఆయన సన్నిహిత మిత్రుడు ఇలంగోవన్ ను లక్ష్యంగా చేసుకొని ముందుకు వెళుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇందులో భాగంగా పళనిస్వామికి భద్రతాధికారిగా పని చేసిన కనకరాజ్ ను తాజాగా అధికారులు విచారించారు. ఇదిలా ఉంటే పళనిస్వామికి డ్రైవర్ గా పని చేసి అనుమానాస్పదంగా మరణించిన ఉదంతాన్ని సీబీసీఐడీ అధికారులు ఫోకస్ పెట్టినట్లుగా తెలుస్తోంది. కొడనాడు ఎస్టేట్ వాచ్ మెన్ హత్య.. పళనిస్వామి డ్రైవర్ అనుమానాస్పద మరణంలో ఒక జ్యోతిష్యుడికి ఉన్న లింకు లెక్క తేల్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు ఈ వ్యవహారంలో శశికళను కూడా విచారించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎస్టేట్ వాచ్ మెన్ హత్య విషయంలో గతంలో శశికళ వద్ద వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేశారు. తాజాగా ప్రత్యక్ష విచారణ చేపట్టనున్నారు.ఇదంతా చూస్తుంటే.. గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న కొడనాడు ఎస్టేట్ హత్యతో పాటు.. పళనిస్వామ డ్రైవర్ అనుమానాస్పద మరణాలు తమిళనాడు రాజకీయాల్లో కొత్త ప్రకంపనలకు కారణమయ్యే అవకాశం ఉందని వినిపిస్తోంది.

## టీడీపీ కార్పొరేటర్ల నిరసన

**విజయవాడ**

బెజవాడ కార్పోరేషన్‌లో తెలుగు దేశం నేతలు లంచ్ బాక్స్‌లతో వినూత్నంగా నిరసన తెలిపారు. కౌన్సిల్ సమావేశాలకు, ప్రతిపక్ష సభ్యులు తింటానికి మాత్రమే వస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపణలు చేయటంపై తెలుగుదేశం కార్పోరేటర్లు అభ్యంతరం తెలిపారు. విజయవాడ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఆసక్తికరంగా సాగింది. ఈ సమావేశానికి సీపీఎం, తెలుగు దేశం పార్టీకి చెందిన కార్పోరేటర్లు వినూత్నంగా నిరసన తెలిపారు. అధికార పక్షం అభివృద్ధి, సంక్షేమంపై చర్చ అంటూనే ప్రతిపక్షాల నోరు నొక్కేందుకు ప్రయత్నిస్తుందని తెలుగు దేశం, సీపీఎం కార్పోరేటర్లు వ్యాఖ్యానించారు. అభివృద్ధి గురించి ప్రశ్నిస్తే, దాడులు చేస్తూ, అక్రమంగా కేసులు పెడుతున్నారని నేతలు ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరిన తమను అవమానించేలా భోజనం చేయటానికే ప్రతిపక్ష సభ్యులు వస్తున్నారంటూ కామెంట్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడ నగర పాలక సంస్థ నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో మధ్యాహ్నం సమయంలో భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్న భోజనానికి 700రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ప్రజా ధనాన్ని ఖర్చు చేసి ఒక్కో ప్లేట్ భోజనం 700 పెట్టి వడ్డిస్తుంటే ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై చర్చించకుండా అడ్డుకుంటున్నారంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పోరేటర్లు చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని రాజేశాయి. దీనికి నిరసనగా తెలుగు దేశం పార్టీకి చెందిన కార్పోరేటర్లు ఇంటి నుంచి వస్తూనే తమతోపాటుగా క్యారియర్లు కూడా తీసుకువచ్చారు.బెజవాడ కార్పోరేషన్ కౌన్సిల్ సమావేశం గరం గరంగా సాగింది. ఇంటి పన్నుల పెంపుదల,ఖాళీ స్థలాలకు పన్నుల మోతపై కార్పోరేషన్‌లో ప్రతిపక్ష సభ్యులు నిరసన తెలిపారు. అయితే ప్రతిపక్షాల నిరసనలను పట్టించుకోని అధికార పక్షం కౌన్సిల్ అజెండాలోని అంశాలపై చర్చించేందుకు ప్రయత్నించింది. దీనిపై ప్రతిపక్ష సభ్యులు కూడా ఎదురు దాడి చేశారు. అధికార పక్షానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నియోజకవర్గాన్ని ఎడారిగా మార్చారని వైసీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి దొంగల పార్టీ అని ఆ పార్టీ నేతలు పలువురు చోరీ కేసుల్లో అరెస్టయ్యారని అయన పేర్కొన్నారు. పగలు వీధుల్లో తిరుగుతూ రిక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో దొంగతనాలను, చోరీలను చేసేలా టిడిపి కార్యకర్తలను గద్దె ప్రోత్సహిస్తున్నారని అయన ఆరోపించారు. 18వ డివిజన్ టిడిపి అభ్యర్థిగ పోటీ చేసిన పీరుబాబుతోపాటు పలువురు టీడిపి నేతలు చోరీ కేసులో అరెస్ట్ అయ్యారని వివరించారు. నియోజకవర్గంలోనీ అన్ని డివిజన్లలో టిడిపి, వైసిపి నేతలపై ఉన్న కేసుల గురించి చర్చించేందుకు తాను సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. రాణిగారి తోటలో జరిగిన చంద్రబాబు కార్యక్రమంలో ఆయన సమక్షంలో టీడిపి తీర్థం పుచ్చుకున్న వారందరూ దొంగలు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యులేనని ఆధారాలతో నిరూపితం అయిందన్నారు. ప్రజల కోసం పని చేయాల్సిన నాయకులపై కేసులు ఉంటే వారిని ఎలా విశ్వసించాలని ప్రశ్నించారు. టీడీపీ నేతలు లంచ్ బ్యాగ్ లతో కౌన్సిల్ లోకి రావటాన్ని వైసీపీ నేతలు లైట్ తీసుకున్నారు.

## మరో రెండు మూడు రోజుల్లోనే..

**హైదరాబాద్**

ఇంటర్ ఫలితాల తెలంగాణ ఇంటర్ ఫలితాల వెల్లడిపై ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ బుధవారం అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి తప్పులు, సమస్యలకు తావివ్వకుండా ఈసారి ఇంటర్ ఫలితాలు వెల్లడించాలని ఆదేశించారు. దీనికోసం ఇంటర్ బోర్డు ప్రత్యేక కసరత్తు చేస్తోంది. ఫలితాల వెల్లడి ప్రక్రియ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో స్పాట్ వ్యాల్యుయేషన్, మార్కుల క్రోడీకరణ, డీ కోడింగ్ ప్రక్రియ, ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు విధానాలపై చర్చించారు. ప్రతీ సంవత్సరం పరీక్షలు, ఫలితాల వెల్లడిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, ఈసారి ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని అన్నారు. ఫలితాల వెల్లడికి అవసరమైతే కొంత సమయం తీసుకోవడానికైనా వెనుకాడవద్దన్నారు. అన్ని స్థాయిల్లో పరిశీలించిన తర్వాతే ముందుకెళ్లాలని అధికారులకు మిత్తల్ సూచించారు.కాగా ఆన్‌లైన్ ఫీడింగ్‌లో గతంలో అనేక పొరపాట్లు చోటుచేసుకున్నాయి. మార్కుల నమోదులో గతంలో ఎందుకు సమస్యలొచ్చాయో సమీక్షించి ఇంటర్ ఫలితాల వెల్లడికి కార్యచరణ రూపొందించాలన్నారు. ఇక ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు 9 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంతమంది మార్కుల నమోదు విషయంలో ప్రత్యేక పరిశీలనకు అధికారులను నియమించారు. అంతిమంగా అన్నీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఫలితాల వెల్లడికి సిద్ధమవ్వాలనే యోచనలో బోర్డు ఉంది. మరో మూడు నాలుగు రోజుల్లో ఫలితాల వెల్లడి తేదీని అధికారికంగా ప్రకటించే వీలుందని బోర్డు వర్గాలు తెలిపాయి. ముందుగా ప్రకటించిన విధంగానే మే రెండో వారం నాటికే ఫలితాలు వెల్లడించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## వీధి కుక్కల బెడద

**ఏలూరు**

పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం యలమంచిలి లో కుక్కలు సైర విహారం చేస్తున్నాయి. ఊరు చివర ఏటుగట్టు దగ్గర దేవరమ్మ జాతర మహోత్సవం సందర్భంగా అన్న సమరధనకు వెళ్తున్న ఐదుగురుపై కుక్క దాడి చేసి కరవడంతో గాయాల పాలయ్యారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించు కున్నారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వరూప్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఆరోగ్య కేంద్రానికి ఐదుగురు కుక్కకాటు బాధితులు వచ్చారని చికిత్స అందించామని తెలిపారు

ప్రజాతపన
prajathapana.com

# గంగమ్మ వైభవాన్ని దేశవ్యాప్తం చేయాలి

**- ఎమ్మెల్యే భూమన**

**గంగమ్మ స్వర కుంభాభిషేకం ఆల్బమ్ ఆవిష్కరణ**

**తిరుపతి**



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ప్రశస్త్యం దేశమంతా తెలిసేలా అమ్మ జాతరను వైభవంగా నిర్వహిద్దామని తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి ప్రజలనుద్దేశించి విజ్ఞప్తి చేసారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లిని కొలుస్తూ, అమ్మ వైభవాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెల్లాలనే ఆలోచనలో భాగంగ 7 పాటలను తీసుకురావడం జరిగిందని ఆయన చెబుతూ 7 పాటలతో రూపొందించిన గంగ జాతర స్వర కుంభాభిషేకం సిడిని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి గురువారం స్థానిక భీమాస్ రెసిడెన్సీ హోటల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత ఐఏఎస్, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, గంగమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ కట్టా గోపీ యాదవ్, ఈవో మునికృష్ణలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ దేశంలోనే మొట్ట మొదటి గ్రామ దేవత దేవాలయం మన తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి ఆలయమని, తిరుపతి గంగమ్మ ఆలయం నుంచే జాన పద పండుగ భావస్ఫూర్తి దేశానికి వ్యాపించిందన్నారు. రాయలసీమకే తిరుపతి గంగ జాతర తలమానికమని వివరిస్తూ గంగమ్మ తల్లి ఆలయ ప్రాశస్త్యం భారత జాతికి తెలియాలన్నారు. ఐదు వందల సంవత్సరాల కిందటి నుంచే తిరుమల శ్రీవారి ఆలయం నుంచి తన చెల్లి గంగమ్మకు సారె సమర్పించే సంప్రదాయం కొనసాగుతున్నదని, గంగమ్మ దర్శనం తర్వాతే తిరుమల శ్రీవారిని దర్శించుకునే విధానం గతంలో ఉండేదని ఆయన గుర్తు చేసారు. తిరుమల శీవారి దేవేరైన, తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగే పంచమితీర్థం సందర్భంగా అమ్మ వారికి సమర్పించే పసుపు, కుంకుమలను గంగమ్మ తల్లి ఆలయం వద్ద నుంచే తీసుకెళ్లే విధానమూ గతంలో ఉండేదన్నారు. తిరుపతి గంగమ్మ ఆశీస్సులు వల్లే మన ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలు లేవని, గడిచిన గత వెయ్యేళ్లలోనూ ఇక్కడ కలరా అంటే ఎమిటో తెలియదని, ఇదంతా గంగమ్మ తల్లి కృపేనన్నారు. బ్రహ్మోత్సవాల తరహాలో గంగ జాతరను వైభవంగా జరపాలన్నదే ఇక్కడి 4.5 లక్షల మంది కోరికని, గంగమ్మ వైభవాన్ని దేశవ్యాప్తం చేయడంలో మీడియా సహకారం అవసరమని భూమన ఆకాంక్షించారు. గంగమ్మ స్వర కుంభాభిషేకం ఆల్బమ్ రూపకల్పన వెనుక కమిషనర్ హరిత సోదరుడు కిషన్ కృషి ఉన్నదని, మంగ్లీ దగ్గర పాడించడమే కాకుండా అమ్మవారికి తన గొంతుతో ఒక పాట పాడడం అమ్మవారి దయేనని చెబుతూ కిశన్, వారి బృందంలోని సంపత్, జశ్వంత్ లకు ప్రత్యేక అభినందనలు ఎమ్మెల్యే భూమన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాలగిరి ప్రతాప్ రెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, హనుమంత నాయక్, రుద్రరాజు శ్రీదేవి, దేవానంధ్, రాజేంద్ర, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ మరోసారి సర్జికల్ దాడులు జరిపే అవకాశం

**భయంతో వణికిపోతోన్న పాకిస్థాన్**

**న్యూఢిల్లీ,**

జమ్మూకశ్మీర్‌లోని పూంచ్ ప్రాంతంలో ఈ నెల 20న రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్ జవాన్లు ప్రయాణిస్తున్న ట్రక్కుపై లష్కర్ ఎ తొయిబా అనుబంధ సంస్థ పీపుల్స్ యాంటీ-ఫాసిస్ట్ ఫ్రంట్ (దాడి జరిపిన నాటి నుంచి పాకిస్థాన్ భయంతో వణికిపోతోంది. భారత్మరోసారి సర్జికల్ దాడులు జరిపే అవకాశం ఉందని పాకిస్థాన్ ఆర్మీ అనుమానిస్తోంది. ఇప్పటికే భారత్ తమ గగనతలంలోకి జొచ్చుకువచ్చిందని పాక్ సైన్యం వెల్లడించింది. పాకిస్థాన్‌పై భారత్ సర్జికల్ దాడులు జరిపే అవకాశం ఉందని అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో జరపకపోవచ్చని భారత్‌లో పాక్ మాజీ హై కమిషనర్ అబ్దుల్ బాసిత్ చెప్పారు. ఓ పక్క షాంఘై సహకార సంస్థకు, మరో పక్క జీ20 దేశాలకు భారత్ ప్రస్తుతం అధ్యక్షత వహిస్తున్న తరుణంలో పాకిస్థాన్‌పై సర్జికల్ దాడులు జరపకపోవచ్చని బాసిత్ అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు భారత్ పాకిస్థాన్‌పై సర్జికల్ దాడులు జరిపే అవకాశం ఉందని ఆయన చెప్పారు. అదే సమయంలో పూంఛ్‌లో ఉగ్రవాదులు సైన్యాన్ని లక్ష్యం చేసుకున్నారని, పౌరులను కాదంటూ ఆయన ఉగ్రదాడిని సమర్థించారు.

మరోవైపు పాక్ మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ బాజ్వా ఇటీవల యూకే44 ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాకిస్థాన్ సైన్యం పరిస్థితి దారుణంగా ఉందని, భారత్‌తో తలపడే పరిస్థితిలో లేదని వెల్లడించడంతో కలకలం రేగింది. పాక్ సైన్యానికి సంబంధించిన వాహనాలకు కనీసం డీజిల్ కూడా అందుబాటులో లేదని, పాక్ ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే అని ఆయన వ్యాఖ్యానించడంతో దుమారం రేగింది. దీనిపై పాక్ ఆర్మీ స్పందించింది. యుద్ధం కనుక వస్తే భారత్‌కు తగిన జవాబు చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పాక్ ఆర్మీకి చెందిన మేజర్ జనరల్ అహ్మద్ షరీఫ్ చెప్పారు. తమ ఎయిర్‌ఫోర్స్ బలగాలు సదా సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పుకొచ్చారు. దీనికి తోడు భారత సైన్యాధికారులు పూంచ్, రాజౌరీలో పర్యటించారు. ఈ సెక్టార్లలో సన్నద్ధతను నార్తెర్న్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ పరిశీలించారు. సైనిక బలగాలతో ఆయన మాట్లాడారు. దీంతో పాకిస్థాన్‌లో అలజడి మరింత పెరుగుతోంది. పూంఛ్‌లో ఏప్రిల్ 20న పీఏఎఫ్ఎఫ్ జరిపిన దాడిలో ఐదుగురు రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్ జవాన్లు చనిపోయారు. సరిగ్గా.. 2021లో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలోనే పీఏఎఫ్ఎఫ్ ఈ ఘాతుకానికి ఒడిగట్టింది. 2019లో అల్ ఖైదా ప్రేరణతో పురుడుపోసుకున్న ఈ ఉగ్రసంస్థ.. జైషే మహమ్మద్‌కు అనుబంధంగా పనిచేస్తోంది. యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షిస్తూ రిక్రూట్‌మెంట్లకు పాల్పడుతోంది. జమ్మూకశ్మీర్‌లో జరిగిన పలు ఉగ్రదాడుల్లో పీఏఎఫ్ఎఫ్ పాత్ర ఉండడం, దేశంలోని పలు ప్రాంతాల్లో విధ్వంసాలకు కుట్రలు పన్నడంతో కేంద్ర హోంశాఖ ఈ ఏడాది జనవరిలో ఈ సంస్థపై నిషేధం విధించింది.

2019 ఫిబ్రవరి14న పుల్వామాలో జైష్ ఎ మహ్మద్ ఉగ్రవాదులు జరిపిన దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చనిపోయారు. దీంతో ఫిబ్రవరి 26న 12 మిరాజ్ 2000 ఫైటర్ జెట్స్‌తో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ బలగాలు పాక్‌లోని బాలాకోట్‌లో ఉన్న జైష్ ఎ మహ్మద్ ఉగ్రవాద శిక్షణా కేంద్రాలపై సర్జికల్ దాడులు జరిపి నామరూపాల్లేకుండా చేశాయి. సరిగ్గా ఈ తరహాలోనే భారత్ మరోసారి సర్జికల్ దాడులకు పాల్పడుతుందని పాక్ హడలిపోతోంది.

# ఏపీ నుండి రేణుకా చౌదరి పోటీ ?

**హైదరాబాద్**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి రాబోయే ఎన్నికల్లో ఏపీ నుండి పోటీచేయాలని అనుకుంటున్నారా ? ఇదే విషయమై ఆరాతీస్తే అవుననే సమాధానం వినిపిస్తోంది. సంవత్సరాలుగా ఆమెకు మద్దతుదారులుగా ఉన్న కొందరు నేతలు మాట్లాడుతు రాబోయే ఎన్నికల్లో రేణుక విజయవాడ లోక్ సభ నుండి పోటీచేసే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. రెండుసార్లు ఖమ్మం పార్లమెంటుకు గెలిచిన రేణుకకు రాబోయే ఎన్నికల్లో టికెట్ దక్కేది అనుమానమేనట. పొగులేటి శ్రీనివాసుల రెడ్డి తొందరలోనే కాంగ్రెస్ లో చేరబోతున్నారనే ప్రచారం అందరికీ తెలిసిందే. అదే జరిగితే పొంగులేటి ఖమ్మం ఎంపీగా పోటీ చేస్తారని చెబుతున్నారు. ఇదివరకే ఎంపీ గా చేశారుకాబట్టి రాబోయే ఎన్నికల్లో కూడా ఎంపీగానే పోటీచేస్తారు. పొంగులేటికి స్వయంగా రాహూల్ గాంధీయే టికెట్ హామీ ఇచ్చిన తర్వాత టికెట్ కోసం ఇక రేణుక ఎంత ఒత్తిడి పెట్టినా లాభముండదు. పైగా రేణుక అవుట్ డేటెడ్ పొలిటీషియన్ అయిపోయారని ఖమ్మంలోనే టాక్ వినిపిస్తోంది. ఎక్కువ రోజులు ఢిల్లీ హైదరాబాద్ లో ఉండే రేణుక అవసరమైనపుడు మాత్రమే ఖమ్మంలో కనబడుతుంటారు. అదే పొంగులేటి అయితే స్థానికుడు కాబట్టి నేతలు క్యాడర్ కు రెగ్యులర్ గా అందుబాటులో ఉంటారు. కాబట్టి వచ్చేఎన్నికల్లో పొంగులేటి ఖమ్మంలో పోటీచేయటం దాదాపు ఖాయమైపోయింది. ఈ నేపధ్యంలోనే రేణుక కన్ను విజయవాడ లోక్ సభ మీదపడిందట. ఏపీలో అయితే ఏ సీటులో పోటీచేయాలన్నా పెద్దగా పోటీ ఉండదు. ఎందుకంటే రాష్ట్ర విభజనతో పార్టీని స్వయంగా అధిష్టానమే భూస్థాపితం చేసేసింది. కాబట్టి ఏపీలో పార్టీకి నేతల కరువుంది. ఈ విషయాన్ని గమనించే రేణుక కూడా ఆమధ్య ఏపీలో పోటీచేస్తానని గుడివాడలో పోటీచేస్తానని చెప్పింది. విజయవాడ లోక్ సభకు పోటీచేసే ఉద్దేశ్యంతోనే రెగ్యులర్ గా అమరావతి ఆందోళనల్లో కూడా పాల్గొంటున్నారు. అమరావతి ఆందోళనల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రతిసారి విజయవాడలో మీటింగులు పెట్టుకుంటున్నారు. ఇదంతా రేణుక ఒక ప్లాన్ ప్రకారమే చేస్తున్నారని ఆమె మద్దతుదారులంటున్నారు. మరి గెలుపు అవకాశాలు ఎంతుందో ఆమెకే తెలియాలి. హైదరాబాద్ నుండి ఖమ్మంకు వలసవచ్చిన రేణుక అవసరమైతే ఖమ్మం నుండి విజయవాడకు వలస వెళ్ళటానికి రెడీగా ఉన్నారట. మరి చివరకు ఏమవుతుందో చూడాల్సిందే.

# జగన్ ప్రభుత్వం వేధింపుల వల్లే కోడెల ఆత్మహత్య

**చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు**

**సత్తెనపల్లి :**



మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ రావు ఆత్మహత్యపై టీడీపీ అధినేత చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో పర్యటించిన ఆయన అక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కోటప్పకొండ అంటే కోడెల శివప్రసాదరావు గుర్తు వస్తారని తెలిపారు. అంతగా ఆయన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని కొనియాడారు. పల్నాటి పులిగా ఉన్న కోడెలను జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేధించిందని.. అవమానించి ఆయన ఆత్మహత్య చేసుకునేలా చేసిందని చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. చెరువులో ఎన్టీఆర్ విగ్రహం ఆధునికీకరణ మనిషి మరణించినా గౌరవప్రదంగా అంత్యక్రియల నిర్వహణకు శ్మశానాల అభివృద్ధి ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం మరుగుదొడ్ల నిర్మాణాన్ని కోడెల శివప్రసాద్ చేపట్టారని గుర్తు చేశారు. పల్నాటి పులిగా ఉన్న ఆయన తన జీవితంలో ఎవరికీ భయపడలేదన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ఆ రోజుల్లోనే క్యాన్సర్ ఆస్పత్రి కోసం విశేష కృషి చేశారని కొనియాడారు. జగన్ వచ్చాక కోడెలను వేధించి అవమానించి ఆత్మహత్య చేసుకునేలా చేశారని మండిపడ్డారు. అలాంటి మంచి వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన జగన్ ను చరిత్ర క్షమించదని చంద్రబాబు హాట్ కామెంట్స్ చేశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. 2014లో టీడీపీ గెలిచాక కోడెల శివప్రసాదరావు శాసనసభ స్పీకర్ గా బాధ్యతలు చేపట్టారు. వైసీపీ నుంచి గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలు టీడీపీలో చేరినా స్పీకర్ గా కోడెల వారిపై అనర్హత వేటు వేయలేదని వైసీపీ తీవ్ర విమర్శలు చేసింది. అలాగే శాసనసభలో తమకు మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా వేధించారని కోడెలపై వైసీపీ ఆరోపణలు చేసింది. లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కోడెల శివప్రసాద్ కుమారుడు కుమార్తె టీడీపీ ప్రభుత్వ హయాంలో కే ట్యాక్స్ పేరుతో సత్తెనపల్లి నరసరావుపేట నియోజకవర్గాల్లో వ్యాపారులు దుకాణాదారులు కాంట్రాక్టర్ల నుంచి భారీగా నగదు వసూలు చేశారని కేసులు నమోదు చేసింది. కోడెల శివప్రసాద్ పై తీవ్ర ఆరోపణలు మోపింది. అలాగే కోడెల శివప్రసాద్ ఆయన కుమారుడు కుమార్తెలపై జగన్ ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. ఈ వేధింపులు భరించలేకే కోడెల శివప్రసాద్ ఆత్మ హత్యకు పాల్పడ్డారని అప్పట్లో తీవ్ర విమర్శలు చెలరేగాయి.

# వివేక హత్య కేసులో మరో మలుపు

**ఏ1 నిందితుడు గంగిరెడ్డి బెయిల్ రద్దు**

**హైదరాబాద్**



వివేక హత్య కేసులో కీలక పరిణామం జరిగింది. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి బెయిల్‌ను రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. మే ఐదు లోపు సీబీఐ కోర్టు ముందు లొంగిపోవాలని ఆదేశాలు ఇచ్చింది. జులై 1న దర్యాప్తు పూర్తి చేసి గంగిరెడ్డికి బెయిల్ మంజూరు చేయాలని సిబిఐ కోర్టుకు హైకోర్టు ఆదేశించింది. ఈ బెయిల్ రద్దు రెండు నెలలు మాత్రమే వర్తిస్తుందని హైకోర్టు చెప్పింది. ఈ రెండు నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించింది. జూన్ 30 వరకు మాత్రమే గంగిరెడ్డి బెయిల్ రద్దు పరిమితి అని తేల్చి చెప్పింది. జులై 1న గంగిరెడ్డికి బెయిల్ మంజూరు చేయాలని సీబీఐ కోర్టును ఆదేశించింది. లక్షన్నర షూరిటీతో బెయిల్ ఇవ్వాలని స్పష్టంగా వివరించింది. 2019మార్చి 15న హత్య జరిగింది. అనంతరం ఆయన్ని సిట్ అధికారులు అరెస్టు చేశారు. అయితే ఆరు నెలల్లోపు ఛార్జ్‌షీట్ దాఖలు చేయని కారణంగా గంగిరెడ్డి 2019 అక్టోబర్‌లో డిఫాల్ట్ బెయిల్ పొందారు. ఈ బెయిల్‌ను పులివెందులకోర్టు మంజూరు చేసింది. తర్వాత కేసు టేకప్ చేసిన సీబీఐ గంగిరెడ్డి బెయిల్ రద్దు కోసం ఎంతగానో ప్రయత్నిస్తోంది. గంగిరెడ్డి ఏ1గా ఉన్నాడని కేసులో ఆయనదే ప్రధాన పాత్ర అని 2021లో సిబిఐ చార్జిషీట్ కూడా వేసింది. చాలా కీలకమైన నిందితుడిగా ఉన్న గంగిరెడ్డి బయట ఉంటే కేసు జాప్యమవుతుందని... సాక్షులు కూడా ప్రభావితం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాదించింది. ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై వాదనలు బుధవారమే పూర్తైనా తీర్పును గురువారానికి వాయిదా వేస్తున్నట్టు కోర్టు తెలిపింది. వివేక కేసులో గంగిరెడ్డి కీలకమైన వ్యక్తి అని ఆయన బెయిల్ రద్దు చేయాలని సీబీఐ కోరింది. ఆయన సాక్షులను ప్రభావితం చేస్తున్నారని వాదించింది. అసలు హత్యకు కుట్ర చేసిందే ఆయనని విన్నవించుకుంది. వివేక వద్ద డ్రైవర్‌గా పని చేసిన తాను హత్య చేయలేనని... 40 కోట్లు ఇస్తానంటూ దస్తగిరి వాంగ్మూలంలో చెప్పినట్టు సీబీఐ తెలిపింది. డీఫాల్ట్ బెయిల్ ను మెరిట్ ఆధారంగా రద్దు చేయాలని సునీత వాదించారు. అన్ని వర్గాల వాదనలు విన్న తెలంగాణ హైకోర్టు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోనుందో మరికాసేపట్లో తేలనుంది. ఇప్పటికే గంగిరెడ్డి బెయిల్ రద్దు విషయంలో చాలా కోర్టుల్లో సీబీఐకి ఎదురు దెబ్బ తగిలింది. ఇదే విషయాన్ని కోర్టు దృష్టికి గంగిరెడ్డి తరఫున న్యాయవాదులు తీసుకెళ్లారు. ఈ హత్యతో గంగిరెడ్డికి సంబంధం లేదని చెప్పారు. ముగ్గురు వాదనలు విన్న హైకోర్టు షరతులతో గంగిరెడ్డి బెయిల్ రద్దు చేసింది. ఇప్పటికే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం అవినాష్ రెడ్డి కొన్ని వారాల నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. అది అనేకరకాలైన మలుపులు తిరిగి చివరకు తెలంగాణ హైకోర్టుకు వచ్చింది.

# అత్తింటి వేధింపులకు గృహిణి ఆత్మహత్య

**నిన్ను నువ్వు ప్రశ్నించుకో.. భర్తకు మృతురాలి చివరి లేఖ వైరల్**

**విశాఖపట్టణం:**

విశాఖ ఆర్కే బీచ్ లో శవమై లభ్యమైన యువతి ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. మొదట్లో ఇక్కడ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు యువతి ఆత్మహత్యగా భావించారు. వివరాలు రాబట్టిన తరువాత ఆమె పేరు శ్వేతగా.. ప్రస్తుతం ఆమె 5 నెలల గర్భిణీ గా తేలడంతో మరింత లోతుగా లోతుగా విచారణ జరిపారు. ఈ సందర్భంగా పోలీసులు శ్వేత రాసిన ఓ లెటర్ ను బయటపెట్టారు. ఇందులో శ్వేత రాసిన కొన్ని వ్యాఖ్యలను పరిశీలిస్తే కుటుంబ సమస్యలతోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఇందులో 'నిన్ను నువ్వు ప్రశ్నించుకో..' అని భర్తను ఉద్దేశించి రాయడంపై తీవ్రంగా చర్చించుకుంటున్నారు. శ్వేత కుటుంబ సమస్యలతో తీవ్రంగా మనోవేదన చెందినట్లు తెలుస్తోంది. ఆమె ఆత్మహత్య చేసుకునే ఒకరోజు ముందు ఓ లెటర్ ను రాసి ఇంట్లో పెట్టి రాత్రి 7 గంటల ప్రాంతంలో ఆమె బయటకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ సమయంలో ఆమె బ్లూ గౌన్ వేసుకున్నారని అంటున్నారు. అయితే అంతకుముందే అత్తమామలు ఆసుపత్రి పనిమీద బయటకు వెళ్లి తిరిగి వచ్చారు. ఈ సమయంలో శ్వేత కనిపించకపోవడంతో రాత్రి 12 గంటల వరకు వేచి చూశారు. ఆ తరువాత న్యూ పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు అదృశ్యం కేసుగా నమోదు చేశారు. విశాఖ రైల్వే ఆసుపత్రిలో శ్వేత నర్సుగా పనిచేస్తున్నారు. గాజువాక సమీపంలోని ఉక్కు నిర్వాసితుల కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గురువిల్లి మణికంటతో ఏడాది కిందట వివాహం అయింది. అయితే 15 రోజులు కిందట మణికంఠ కార్యాలయం పనిమీద హైదరాబాద్ కు వెళ్లారు. దీంతో శ్వేత అత్తమామలతోకలిసి ఉంటున్నారు. ఈ క్రమంలో ఆమె చనిపోయే ముందు రోజు తన భర్త మణికంఠతో చాలా సేపు ఫోన్లో మాట్లాడినట్లు వివరాలు సేకరించారు. ఈ సమయంలో వీరి మధ్య మాటా మాటా పెరిగిందని తెలుస్తోంది. ఈ క్రమంలో ఆమె ఓ లెటర్ రాసి బయటకు వెళ్లింది. ఈ లెటర్ లో 'నేను లేకుండా నువ్వు హ్యాపీగా ఉండగలవని నేను అనుకుంటున్నా ఏదేమైనా నీ ఫ్యూచర్ న్యూ లైఫ్ కు ఆల్ ది బెస్ట్.. నీతో చాలా మాట్లాడాలని ఉంది. కానీ నేనేమీ మాట్లాడలేకపోతున్నా.. అయితే ఒకసారి 'నిన్ను నువ్వు ప్రశ్నించుకో..' అని లెటర్ లో రాసి ఉంది. ఈ లెటర్ ను చూసి శ్వేత తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. తమ కూతురు అత్తింటి వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకుందని ఆరోపిస్తున్నారు.

# 'ఉగ్రం'లో ఛాలెజింగ్ రోల్ చేశాను



**'నాంది' తో విజయవంతమైన చిత్రాన్ని అందించిన అల్లరి నరేష్, విజయ్ కనకమేడల మరో యూనిక్, ఇంటెన్స్ మూవీ 'ఉగ్రం' తో వస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది గ్రాండ్‌గా నిర్మించారు. మిర్నా మీనన్ కథానాయికగా నటించింది. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ ట్రెమండస్ రెస్పాన్స్ తో ఉగ్రంపై అంచనాలని పెంచాయి. మే 5న సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో 'ఉగ్రం' విశేషాలని విలేకరుల సమావేశంలో పంచుకున్నారు మిర్నా మీనన్.**

**మీ ప్రయాణం గురించి చెప్పండి ? 'ఉగ్రం' ప్రాజెక్ట్ లోకి ఎలా వచ్చారు ?**

నేను డెవలపర్ ని. దుబాయి లో ఇంజనీర్ గా పని చేశాను. తర్వాత కేరళ వచ్చి పని చేశాను. కానీ చిన్నప్పటి నుంచి సినిమా ఇష్టం. యాక్టర్ అవ్వాలని వుండేది. ఒక రోజు దర్శకుడు అమీర్ నుంచి కాల్ వచ్చింది. తమిళ్ లో ఆర్యతో నటించే అవకాశం వచ్చింది. అలా నా యాక్టింగ్ కెరీర్ మొదలైయింది. తర్వాత సూపర్ స్టార్ మోహన్ లాల్ గారి 'బిగ్ బ్రదర్' చేశాను. అదే సమయంలోనే లాక్ డౌన్ వచ్చింది. దీని తర్వాత 'క్రేజీ ఫెలో' చేశాను. దీని తర్వాత సూపర్ స్టార్ రజినీకాంత్ గారి 'జైలర్' సినిమాలో అవకాశం వచ్చింది. అది ఫస్ట్ షెడ్యూల్ లో ఉండగానే ఉగ్రం దర్శకుడు విజయ్ సంప్రదించారు. అలా ఈ ప్రాజెక్ట్ లోకి వచ్చాను.

ఉగ్రంలో మిమ్మల్ని ఆకర్షించిన అంశాలు ఏమిటి ?

నాంది టీం మళ్ళీ కలసి చేస్తున్న సినిమా ఉగ్రం. దర్శకుడు విజయ్ గారికి వర్క్ నాకు చాలా ఇష్టం. అలాగే నరేష్ గారికి నేను అభిమానిని. ఉగ్రం కథ చెప్పినప్పుడే ఓకే చెప్పేశాను. కథ చాలా ఆసక్తికరంగా వుంటుంది. ఇందులో నా పాత్ర ఛాలెజింగ్ గా వుంటుంది. కాలేజీ అమ్మాయిగా, భార్యగా, ఒక బిడ్డకు తల్లిగా.. ఇలా భిన్నమైన కోణాలు నా పాత్రలో కనిపిస్తాయి. కెరీర్ బిగినింగ్ లో ఇలాంటి పాత్ర చేయడం సవాలే. ఆ సవాల్ ని స్వీకరించి ఈ పాత్రని చేశాను.

**ఉగ్రం కథలో మీ పాత్రకు ప్రాధన్యత ఎలా వుంటుంది ?**

ఇందులో నా పాత్ర పూర్తి స్థాయిలో వుంటుంది. నరేష్ గారితో పాటు నా పాత్ర కూడా కథలో ప్రయాణిస్తూ వుంటుంది. నటనకు ఆస్కారం వుండే పాత్ర దక్కినందుకు చాలా ఆనందంగా వుంది.

**ఈ పాత్ర కోసం ఎలాంటి హోం వర్క్ చేశారు**

సెట్ కి వచ్చే ముందు నేను హోం వర్క్ చేస్తాను. యాక్టింగ్ ని ప్రొఫెషనల్ గా నేర్చుకున్నాను. కాలేజీ అమ్మాయిగా చేసినప్పుడు , భార్యగా కనిపించినపుడు, ఒక బిడ్డకు తల్లిగా చేసినప్పుడు ఆలోచనలో, హావభావాల్లో స్పష్టమైన తేడాలు ఉంటాయి. వాటి అన్నిటి పై ప్రత్యేక దృష్టి పెడతాను.

**కెరీర్ ఆరంభంలోనే బిగ్ స్టార్స్ తో పని చేయడం ఎలా అనిపించింది ?**

ఈ విషయంలో నేను అదృష్టవంతురాలినని భావిస్తాను. తెలుగులో కూడా మంచి ఆదరణ లభిస్తోంది.

**నరేష్ గారితో పని చేయడం ఎలా అనిపించిది ?**

నరేష్ గారు చాలా కూల్ గా వుంటారు. కామెడీ, సీరియస్ రెండు పాత్రలని అద్భుతంగా హ్యాండిల్ చేస్తారు. కళ్ళతో హావభావాలు పలికిస్తారు. గ్రేట్ కోస్టార్. నరేష్ గారితో వర్క్ చేయడం మంచి అనుభూతి.

**దర్శకుడు విజయ్ కనకమేడల గురించి ?**

విజయ్ చాలా క్లారిటీ వున్న దర్శకుడు. తన స్క్రీన్ ప్లే రాసుకునే విధానం అద్భుతంగా వుంటుంది. ప్రతి సీన్ కి చివర్లో ఒక మీనింగ్ వుంటుంది. అది కథలో భాగమవుతుంది. తను మంచి ఎడిటర్ కూడా. సినిమా ఆయన మైండ్ లోనే ఎడిట్ అయిపోతుంది. ఆయన తీసిన ప్రతీదీ సినిమాలో వుంటుంది. ఎంత కావాలో అంతే తీస్తారు. ఆయన పర్ఫెక్షనిస్ట్. విజయ్ గారి వర్క్ కి నేను ఫ్యాన్ అయిపోయా.

**ఇందులో మీ పాత్రలో గ్లామర్ ఉంటుందా ?**

ఇందులో ఒక పాట బెంగళూరు లో షూట్ చేశాం. ఈ పాట కూడా కథలో భాగం గానే వుంటుంది. నేను ఇందులో బాధ్యత గల గృహిణి గా కనిపిస్తా. తను ఓ పోలీస్ అధికారికి భార్య. ఆ పాత్రకు ఎంత గ్లామర్ కావాలో అంత వుంటుంది.

**ఉగ్రంలో ఎక్కువగా రాత్రి వేళల్లో షూట్ చేసారు కదా ?**

75 రోజుల వర్కింగ్ కాల్షీట్ లో 55 రోజులు నైట్ షూట్ చేశాం. కంటిన్యూగా 15 రోజులు నైట్ షూట్ లో 48 గంటలు బ్రేక్ లేకుండా చేశాం. ఇది డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్. భారీ వర్షం, హైవే పై దుమ్ము లో షూట్ చేశాం. కొన్ని రియల్ స్టంట్స్ చేశాం. ట్రైలర్ లో చూపించిన కారు ప్రమాదం సీన్ రియల్ స్టంట్. చాలా రిస్క్ అనిపించింది. నరేష్ గారికి స్క్రాచెస్ కూడా అయ్యాయి. ఇందులో పాపగా నటించిన ఊహ కూడా అద్భుతంగా చేసింది.

**షైన్ స్క్రీన్స్ నిర్మాణంలో పని చేయడం ఎలా అనిపించింది ?**

షైన్ స్క్రీన్స్ వారి మజిలీ సినిమా చూశాను. చాలా నచ్చింది. చాలా మంచి ప్రొడ్యూసర్స్. మంచి సినిమాలు చేయాలనే ఆలోచనతో వుండే నిర్మాతలు. ఉగ్రం ను ఎక్కడా రాజీ పడకుండా చేశారు. నేను పని చేసిన నిర్మాతల్లో షైన్ స్క్రీన్స్ బెస్ట్ ప్రొడ్యూసర్స్.

**కొత్తగా చేయబోతున్న సినిమాలు ?**

వెట్రిమారన్ గారి కథతో అమీర్ గారి దర్శకత్వంలో ఓ సినిమా వుంటుంది. మలయాళంలో మరో సినిమా చేస్తున్నా.

# 'భోళా శంకర్' భారీ ఇంటర్వెల్ సీక్వెన్స్ షూటింగ్, డబ్బింగ్ ప్రారంభం



మెగాస్టార్ చిరంజీవి, స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ ల క్రేజీ ప్రాజెక్ట్ "భోళా శంకర్". రామబ్రహ్మం సుంకర అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మెగా మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 2023 క్రేజీయస్ట్ ప్రాజెక్ట్‌లలో ఒకటి. నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం, మెగాస్టార్ చిరంజీవి, షావర్ అలీ, వజ్ర ఉ ఫైటర్స్, ఇతర ప్రముఖ తారాగణం షూటింగ్‌లో పాల్గొంటున్న భారీ ఇంటర్వెల్ సీక్వెన్స్ హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు. కాగా, మేకర్స్ పూజా కార్యక్రమాలతో డబ్బింగ్ పనులు ఈరోజు ప్రారంభించారు. జూన్ చివరి నాటికి భోళా శంకర్ షూటింగ్ మొత్తం పూర్తవుతుంది.

క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌లో ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్ ఉ యాక్షన్‌తో పాటు లావిష్ గా షూట్ చేసిన పాటలు ఉంటాయి.మెహర్ రమేష్ ఈ చిత్రంలో చిరంజీవిని పూర్తి స్టైలిష్ మాస్ అవతార్‌లో ప్రజంట్ చేస్తున్నారు. ప్రమోషనల్ కంటెంట్ కు అద్భుతమైన స్పందన వచ్చింది.

తమన్నా కథానాయికగా నటిస్తుండగా, కీర్తి సురేష్, చిరంజీవి సిస్టర్ గా కనిపించనుంది. టాలెంటెడ్ యాక్టర్ సుశాంత్ ఈ సినిమాలో లవర్ బాయ్ పాత్రలో నటిస్తున్నాడు.

ఈ చిత్రానికి డడ్లీ డీవోపీగా పని చేస్తున్నారు. సత్యానంద్ కథ పర్యవేక్షణ చేయగా తిరుపతి మామిడాల డైలాగ్స్ అందిస్తున్నారు. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటర్ గా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ నిర్మాత.ఆగస్ట్ 15 (మంగళవారం) స్వాతంత్ర్య దినోత్సవం హాలిడే లాంగ్ వీకెండ్ కలిసోచ్చేలా 'భోళా శంకర్' ఆగస్టు 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఆగస్ట్ 22న మెగా స్టార్ పుట్టినరోజు.

తారాగణం: చిరంజీవి, తమన్నా, కీర్తి సురేష్, సుశాంత్, రఘుబాబు, రావు రమేష్, మురళీ శర్మ, రవిశంకర్, వెన్నెల కిషోర్, తులసి, ప్రగతి, శ్రీ ముఖి, బిత్తిరి సత్తి, సత్య, గెటప్ శ్రీను, రష్మీ గౌతమ్, ఉత్తేజ్, ప్రభాస్ శీను తదితరులు.

# 'మేమ్ ఫేమస్' సెకండ్ సింగిల్ మినిమమ్ సాంగ్ లాంచ్



'రైటర్ పద్మభూషణ్' బ్లాక్ బస్టర్ విజయం తర్వాత లహరి ఫిల్మ్స్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ కలిసి చేస్తున్న మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ 'మేమ్ ఫేమస్'. సుమంత్ ప్రభాస్ ప్రధాన పాత్ర పోషించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ హిలేరియస్ మ్యూజికల్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్ ని అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ కలిసి నిర్మిస్తున్నారు. మణి ఏగుర్ల, మౌర్య చౌదరి, సార్య , సిరి రాసి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. కళ్యాణ్ నాయక్ సంగీతం అందించిన ఫస్ట్ సింగిల్ అయ్యయ్యో ప్లజంట్ మెలోడీకి అద్భుతమైన స్పందన వచ్చింది. ఇప్పుడు, సెకండ్ సింగిల్ మినిమమ్‌ను లాంచ్ చేశారు. ఇది మొదటి దానికి పూర్తిగా భిన్నమైన ట్రాక్. ఈ మాస్ నెంబర్ యూత్ స్టయిల్ స్వాగ్ ని చూపుతుంది. సుమంత్ ప్రభాస్, మణి ఏగుర్ల , మౌర్య చౌదరి దినచర్యను ప్రజెంట్ చేసింది. వారు రోజంతా చిల్ గా ఉంటారు. ఎవరినీ పట్టించుకోరు.మొదటి పాటను పాడిన రాహుల్ సిప్లిగంజ్ ఈ పాటని పాడారు. హై పిచ్ వోకల్స్‌తో మాస్ ఎనర్జీని నింపారు . కంపోజర్ కళ్యాణ్ నాయక్, కోటి మామిడాలతో కలసి సాహిత్యం అందించారు. సుమంత్ ప్రభాస్, మణి ఏగుర్ల, మౌర్య చౌదరి గ్రామీణ ప్రాంతాల్లో చిచోరా బ్యాచ్‌కి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇది యూత్‌తో పాటు మాస్‌ని అలరించేలా ఉంది.

శ్యామ్ దూపాటి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ చిత్రానికి సృజన అడుసుమిల్లి ఎడిటర్, అరవింద్ మూలి ఆర్ట్ డైరెక్టర్.

మేమ్ ఫేమస్ జూన్ 2న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

తారాగణం: సుమంత్ ప్రభాస్,మణి ఏగుర్ల, మౌర్య చౌదరి, సార్య, సిరి రాసి, నరేంద్ర రవి, మురళీధర్ గౌడ్, కిరణ్ మచ్చ, అంజిమామ, శివ నందన్

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950